PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 323 | విజయవాడ, శుక్రవారం 28 జూన్ 2024 | 6 + 8 పేజీ వెల : 5.50

Vol No | Vijayawada, Friday 28 June 2024 | Rs

ముస్లింలపై విషపూరిత మతోన్మాద దాడులు

- ఖండించిన సిపిఎం
- నిరసనలకు పిలుపు

5

సిఎస్‌గా నీరబ్ పదవీకాలం పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీకాలన్ని మరో ఆరు నెలలు పొడిగించారు. ఈ మేరకు డిపార్టుమెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) ఆదేశాలిచ్చింది. ప్రస్తుత సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పదవీకాలం ఈ నెల 30తో ముగుస్తుంది. దీంతో అతని పదవీకాలాన్ని పొడిగించాలని కేంద్రానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. దీన్ని పరిశీలించిన కేంద్రం వెంటనే అనుమతినిచ్చింది. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకూ నీరబ్‌కుమార్ ఆ పదవిలో కొనసాగనున్నారు.



కానూరులో జరిగిన రామోజీరావు సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

ధరలు, నిరుద్యోగం ఊసే లేదు

- పాత పాటగా రాష్ట్రపతి ప్రసంగం
- సిఎఎకు సమర్థన
- నీట్ దోషులను శిక్షిస్తామని హామీ
- బహిష్కరించిన ఆప్ ఎంపీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గురువారం చేసిన ప్రసంగం పాత చింతకాయ పచ్చడిలా సాగింది. కొత్త ప్రభుత్వ విధానాలను మార్గనిర్దేశం చేసేలా ఉండాల్సిన ఈ ప్రసంగంలో నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్తగా చెప్పిందేమీ లేదు. గత ఐదేళ్లుగా చెప్పినవే, మళ్లీ ఉద్ఘాటించారు. అధిక ధరలు, నిరుద్యోగం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి వాటి గురించి ప్రస్తావించకుండా తన ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో చర్చనీయాంశమైన అగ్ని పథ్ గురించి ఒక్క ముక్క కూడా ప్రస్తావించలేదు. పార్లమెంటు సక్రమంగా పని చేస్తే ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అప్పుడు ప్రభుత్వంపైనే కాకుండా యావత్ పార్లమెంటరీ వ్యవస్థపై కూడా విశ్వాసం ఉంటుందని, దేశ ప్రజల ఆకాంక్షలను పార్లమెంటు నెరవేరుస్తుందని ఆశిస్తున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు. కానీ, 17వ లోక్‌సభలో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు అనుమతించలేదనే విషయం ఆమెకు తెలియదని అనుకోలేము. ఎలాంటి చర్చ లేకుండా ఒకదాని తరువాత ఒక బిల్లును గిలెటెన్ చేసింది. ఒక



ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్రపతి దౌపది ముర్ము

దశలో రాహుల్ గాంధీ ఎంపీ పదవిని రద్దు చేసింది. సమావేశాల్లో హోం మంత్రి వివరణ కోరినందుకు 140 మంది ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలను సస్పెండ్ చేశారు. ఇదంతా మరచిపోయి పార్లమెంటు సక్రమంగా జరగాలని హితోపదేశం చేశారు.

నీట్‌పై ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చకు నోటీసులిచ్చిన నేపథ్యంలో రాష్ట్రపతి తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ "ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ నియామకాల్లో పారదర్శకత చాలా అవసరం. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఈ విషయంలో అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం." అని ముక్తాయించారు. ఈ అఖిల భారత ప్రవేశ పరీక్షలో అవినీతిపై దేశం మొత్తం ఆందోళన చెందుతోంది. ప్రధానమంత్రి నుంచి కానీ, విద్యా మంత్రి నుంచి కానీ అలాంటి ప్రకటన లేదు. ఎన్‌టిఎ ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తే దానిపై ఎలాంటి చర్యలు లేవు. బిజెపి ఎంపీ మాదిరిగా 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తోందన్నది మరచిపోయారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు తగ్గాయని ఇది ప్రభుత్వ గొప్పతనంగా రాష్ట్ర పని పేర్కొన్నారు. నిజానికి అవి తగ్గలేదు. బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసి తగ్గినట్టుగా చూపారు. వివక్షాపూరితమైన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను గొప్పగా చూపించే ప్రయత్నం చేశారు. మత పరంగా వివక్ష చూపుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా ఆందోళనలు సాగితే దాని గురించి ప్రస్తావించకుండా విదేశాల నుంచి వచ్చే శరణార్థులకు హుందాగా జీవించేందుకు ఇది ఉపయోగపడుతుందని రాష్ట్రపతి సెలవిచ్చారు.

మహిళా సాధికారతకు 'నారీ శక్తి వందన్ అధినయం' ఎంతగానో తోడ్పడుతోందని, అలాగే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామని రాష్ట్రపతి తన మిగతా 5లో

భావి తరాలకు రామోజీ స్ఫూర్తి

- అమరావతిలో విజ్ఞానకేంద్రం
- ఎన్‌టిఆర్‌తో పాటు ఆయనకూ భారతరత్న సాధించాలి
- సంస్మరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రామోజీ రావు స్ఫూర్తిని భావితరాలకు అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభ కానూరులో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ, పాత్రికేయ రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రామోజీరావు పత్రికారంగంలో ఉండి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడారని చెప్పారు. భావి తరాలు ఆయన్ను గుర్తించుకునేలా ఢిల్లీలో ఉన్న విజ్ఞాన్ భవన్ తరహాలో రాజధాని అమరావతిలో కూడా రామోజీరావు పేరుతో విజ్ఞాన్ భవన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమరావతిలోనే ఒక రోడ్డుకు కూడా ఆయన పేరు పెడతామన్నారు. విశాఖపట్నంలో రామోజీరావు చిత్రనగరి పేరుతో సినిమా షూటింగుల కోసం స్థలాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్‌తో పాటు, రామోజీరావుకు కూడా భారత రత్న సాధించాలని తెలిపారు. ఇది తెలుగు ప్రజల అందరి బాధ్యతని అన్నారు. ఎంతోమంది నటులు, కళాకారులు, జర్నలిస్టులకు రామోజీరావు జీవితాన్ని ఇచ్చారని చెప్పారు. నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఉన్నారని వివరించారు. ప్రజాస్వామ్యం అపహాస్యం అయినప్పుడల్లా తాను ఉన్నానంటూ ముందుకొచ్చి పోరాడారని చెప్పారు. పార్టీ స్థాపించిన ఆరు నెలల్లో ఎన్టీఆర్ అధికారంలోకి రావడానికి రామోజీ కూడా కారణమని చెప్పారు. రాజధాని నగరానికి అమరావతి అన్న పేరు పెట్టాలని తనకు సూచించిందికూడా ఆయనే అని అన్నారు. గడిచిన ఐదేళ్లల్లో అమరావతి ఇబ్బందులు పడిందని, రాబోయే రోజుల్లో దాని దశ, దిశ మారుతుందన్నారు. తెలుగుజాతి ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుంతుందని చెప్పారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలపై పోరాటం: పవన్ కళ్యాణ్

ప్రజలకు ఇబ్బంది కలిగించిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రామోజీరావు వార్తలతో మిగతా 2లో

ఒకటిన ఇంటివద్దే పెన్షన్లు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ పంపిణీ చేయాలి
- 29వ తేదీనాడే నగదు డ్రా చేసుకోవాలని సిఎస్ ఆదేశం

విద్యుదాఘాతంతో నలుగురు మృతి

- ఏలూరులో తల్లీ, కొడుకు..
- పశ్చిమగోదావరిలో భార్యభర్తలు

దళితులపై పెత్తందార్ల దాడి

- ఐదుగురికి గాయాలు



లోపలి పేజీలో..

ఇ-క్రాప్ సంగతేంటి?

- పథకాలకు తప్పనిసరి చేసిన గత వైసిపి సర్కార్
- లక్షలాదిగా సాయాన్ని కోల్పోయిన రైతులు, కౌల్దార్లు
- ప్రస్తుత ప్రభుత్వ వైఖరిపై ఎదురుచూపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఇన్నాళ్లూ తీవ్ర ప్రతిబంధకంగా తయారైన 'ఇ-క్రాప్' అంశం టిడిపి కూటమి సర్కారు రాకతో చర్చల్లోకొచ్చింది. కొత్త ప్రభుత్వ వైఖరేంటన్న ప్రశ్నలు తలెత్తాయి. సున్నా వడ్డీ రుణాలు, పంటల బీమా, విపత్తుల వలన పంటలు నష్టపోతే అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, చివరికి పండించిన పంటలను రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోడానికి, ఇంకా పలు సర్కారీ స్కీంలన్నింటికీ గత వైసిపి ప్రభుత్వం ఇ-క్రాప్‌ను తప్పనిసరి చేసింది. ఇ-క్రాప్ డిజిటల్ పోర్టల్‌లో రైతులు తమ వివరాలన్నింటిని సక్రమంగా నమోదు చేసుకుంటేనే పథకాలు వర్తిస్తాయని షరతు పెట్టింది. ఇ-క్రాప్‌లో రైతుల పేర్లు సరిగ్గా నమోదు కానందున లక్షలాది మంది అర్హులైన రైతులు పలు పథకాలకు దూరమయ్యారు. ప్రభుత్వ సాయాన్ని కోల్పోయారు. కౌలు రైతులకు సరైన గుర్తింపు లేనందున రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్నవారి పరిస్థితి మరీ దారుణం. ఈ నేపథ్యంలో ఇ-క్రాప్ విధానాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందా, లేదంటే పాత పద్ధతుల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి న్యాయం చేస్తుందా అనే విషయాలపై అన్నదాతల్లో చర్చ సాగుతోంది. వైసిపి ప్రభుత్వ పలు విధానాలను సమీక్షిస్తున్న కూటమి సర్కారు, రైతులకు అన్యాయం చేస్తున్న ఇ-క్రాప్‌పై ఆలోచించాలన్నది రైతుల నుంచి వ్యక్తమవుతున్న కోరిక. దీనిపై ఎన్నికైన అధికార పార్టీ ఎమ్మెల్యేలను, మంత్రులను ఇ-క్రాప్‌పై వైఖరేంటని చాలా చోట్ల అడుగుతున్నారు.

లోపభూయిష్టం

వైసిపి సర్కారు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) సిబ్బందితో డిజిటల్ పోర్టల్ ఇ-పంటలో వివరాలు నమోదు చేయించింది. వెబ్‌ల్యాండ్ పోర్టల్‌ను సపోర్టుగా తీసుకుంది. రైతుల పొలాల వద్దకెళ్లి ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లలో ఫొటోలు తీసి ఇ-క్రాప్‌లో అప్‌లోడ్ చేయమంది. రెవెన్యూశాఖ డెవలప్ చేసిన వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో రైతుల పేర్లు లేకపోతే ఇ-క్రాప్‌లో సాగుల వివరాలు నమోదు కావు. దాంతో కౌలు రైతులు ఇ-క్రాప్ బయటనే ఉండిపోయారు. ప్రభుత్వం జారీ చేసిన సిసిఆర్ కార్డు రెవెన్యూ రికార్డులలో నమోదు చేసి ఉంటే అప్పుడు కౌలు రైతుల పేర్లు ఇ-క్రాప్‌లో ఎక్కుతాయి. సిసిఆర్‌సిల జారీ నామమాత్రంగానే జరిగినందున కౌలు రైతులు ఇ-క్రాప్‌లో ఎక్కే అవకాశాలు చాలా తక్కువ. ఆధార్ అథంటికేషన్, ఇకెవైసి.. ఇలా ఎన్నో షరతులు ఇ-క్రాప్‌కు పెట్టారు. వ్యవసాయ, రెవెన్యూశాఖల జాయింట్ అజమాయిషీ అన్నారు. విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (వివిఎ) మొదలుకొని జిల్లా వ్యవసాయాధికారి (డిఎఒ) వరకు, విలేజి రెవెన్యూ ఆఫీసర్ (విఆర్‌ఒ) మొదలుకొని కలెక్టర్ వరకు వివిధ దశల్లో చెకింగ్‌లు, సూపర్ చెక్స్ అన్నారు. తుదకు ఆర్‌బికెలలో సోషల్ ఆడిట్ అని చెప్పారు. సర్కారీ షరతులు, డేటా ఎంట్రీలో లోపాలు, సిబ్బంది చేసిన తప్పిదాలు... వెరశి లక్షల్లో సొంత భూమి కలిగిన అర్హులైన రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ సాయాన్ని కోల్పోయారు.

అన్ని విధాలా అన్యాయం

ఇ-క్రాప్ లేనందున బ్యాంకుల్లో రుణాలు రాలేదు. సున్నా వడ్డీ పొందలేకపోయారు. పంటల బీమా దక్కలేదు. పంటలు అమ్ముకోలేక దళారులకు, వ్యాపారులకు తెగనమ్ముకున్నారు. కరువు, తుపాన్లు, వరదల వలన పంట నష్టాలు జరిగిన సందర్భంలో ప్రభుత్వం అందించిన పెట్టుబడి రాయితీ కోల్పోయారు. రైతులను, కౌలు రైతులను అన్ని విధాలా నష్టపరిచిన ఇ-క్రాప్ రద్దుపై కూటమి సర్కారు ఆలోచించాలన్నది అన్నదాతల ఆకాంక్ష.

ఎడిసిఎల్ ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీ పార్థసారథి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎడిసిఎల్) ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీ పార్థసారధిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే ఉత్తర్వులు అమల్లోకి వస్తుందని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి విధి విధానాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. సిఆర్‌డిఎ ఏర్పాటుచేసిన సమయంలో నిధుల సమీకరణ, పనులకు సంబంధించి ఎడిసిఎల్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఛైర్‌పర్సన్‌గా మాజీ ఐఎఎస్ అధికారి లక్ష్మీ పార్థసారధిని నియమించారు. ప్రభుత్వం మారడంతో ఆమె పదవి కోల్పోయింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను సిఆర్‌డిఎలో విలీనం చేశారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో మరలా డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు జవసత్వాలు తెచ్చారు. రాజధానికి సంబంధించిన అన్ని పనులూ ఎడిసిఎల్ ఆధ్వర్యాన జరగనున్నాయి. ఎడిసిఎల్ ఛైర్‌పర్సన్ హోదాలో గతంలో అనేక దేశాల ప్రతినిధులు, పెట్టుబడిదారులతో లక్ష్మీ పార్థసారధి నేరుగా చర్చలు జరిపారు.

అమరావతికి ప్రైవేటు పెట్టుబడులు!

- అమెరికా ఎన్ఆర్ఐకి బాధ్యతలు?
- చర్చలకోసం మంత్రి నారాయణతో కమిటి?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల నుండి నిధుల సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బ్యాంకుల నుండి భారీగా రుణాలు తీసుకుని ఉండటంతో, మళ్లీ వాటినుండే నిధుల సమీకరణ దాదాపుగా సాధ్యం కాదన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో ప్రత్యామ్నాయంగా ప్రైవేటు పెట్టుబడుల అంశం ముందుకు వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిధుల సమీకరణలో ఎన్ఆర్ఐలకు పెద్దపీట వేయనున్నారు. దానిలో భాగంగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక అమెరికా ఎన్ఆర్ఐకి నిధుల సేకరణ బాధ్యత అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. అదే సమయంలో సింగపూర్, అమెరికాతో పాటు పలు ఇతర దేశాలకు చెందిన సంస్థలతో కూడా చర్చలు జరపాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటితో పాటు రాజధాని ప్రాంతంలో తమ కార్యాలయాలను ప్రారంభించాల్సిందిగా పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలను కోరాలని నిర్ణయించింది. ఈ రెండిటికోసం పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఒక కమిటీని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయనున్నారు. గతంలోనే అమరావతిలో ఎపిఎన్ఆర్‌టి భవనానికి రాయపూడి వద్ద చంద్రబాబునాయుడు స్థలం కేటాయించారు. దాని ద్వారా కూడా ఇప్పుడు నిధుల సేకరణపై దృష్టి సారించినట్లు తెలిసింది. పెట్టుబడులకు సంబంధించిన కంపెనీల వివరాలను ఇప్పటికే సిఆర్‌డిఏ సిద్ధం చేసింది. ఆయా సంస్థలతో చర్చలు ఎప్పుడు, ఎలా, ఎక్కడ నిర్వహించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మరోవైపు రాజధాని ప్రాంతంలో పస్తుతం ఉన్న పరిస్థితులపై మరో పదిరోజుల్లో సిఆర్‌డిఏ అధికారులు నివేదిక ఇవ్వనున్నారు.

అనంతరం నిధుల కోసం వేట ప్రారంభించనున్నట్లు తెలిసింది. అమరావతి రాజధాని ప్రాజెక్టుకు కనీసం రూ.43 వేల కోట్ల అవసరం ఉంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికిరూ.15 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లకు పిలిచారు. వీటిల్లో దాదాపు తొమ్మిది వేల కోట్ల విలువైన పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని పూర్తయ్యాయి. కొన్ని మధ్యలో నిలిచిపోయాయి. ఇప్పుడు అమరావతిలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నా, కొత్త పనులు ప్రారంభించాలన్నా కనీసం రూ.10 వేల కోట్ల అవసరం ఉంటుందని భావిస్తున్నారు.

'ఉక్కు'పై కేంద్ర విధానం మారాలి

- స్టీల్ మంత్రికి వినతులిచ్చి కాలయాపన చేయొద్దు
- సిఎం చొరవ చేసి ప్రధానిపై ఒత్తిడి తేవాలి : సిఐటియు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ విధానం మారాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా స్టీల్‌ప్లాంట్ పట్ల మోడీ సర్కారు సవతి తల్లి ప్రేమనే చూపుతోందని తెలిపారు. గురువారం ఉదయం విశాఖలోని ఎన్‌పిఆర్ భవన్‌లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి,కార్యదర్శి జి.పుల్లారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం ప్రధాని చేస్తే ఆయనకు మెమొరాండం ఇవ్వకుండా స్టీల్ మంత్రికి ఎంపిలతో కలిసి బిజెపి ఎంపి, రాష్ట్ర అధ్యక్షులు పురంధరేశ్వరి ఇవ్వడం దేనికి? అని ప్రశ్నించారు. ఇది కాలయాపన చేయడమేనన్నారు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని.. ఎవరడ్డు పడ్డారని ఎంపిలంతా కలిసి స్టీల్ మంత్రికి వినతి ఇచ్చారని ప్రశ్నించారు. ఉక్కు ఆస్తుల అడ్డగోలు అమ్మకాన్ని ఆపాలని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చెన్నై మార్కెటింగ్ యార్డ్, హైదరాబాద్ యార్డ్‌లను రూ.476 కోట్లకు అమ్మకాలకు పెట్టడం, రాయిబరేలిలోని రైల్ స్టీల్‌ప్లాంట్‌ను రూ.1910 కోట్లకు అమ్మేశారని, రూ.250 కోట్లకు విశాఖ స్టీల్ ప్లాంట్ గెస్ట్ హౌస్, క్వార్టర్స్‌ను అమ్మేస్తూ ప్లాంట్ వ్యతిరేక చర్యలకు పాల్పడడం సరైంది కాదన్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 2021 జులై 27న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పోరాటాన్ని బలపరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ రక్షణ జరగాల్సిన అవసరాన్ని లేఖ ద్వారా తెలిపారన్నారు. ఆ ప్రకారం నేడు చొరవ చేసి ప్రధాని మోడీ వద్దకు కార్మిక ప్రతినిధులను, అఖిలపక్షం నేతలను తీసుకెళ్లి ప్రయివేటీకరణ చర్యలు ఆపే ప్రయత్నం చేయాలని కోరారు. 2047 నాటికి 500 టన్నుల ఉత్పత్తి చేయాల్సిన లక్ష్యం గల ప్లాంట్ ఇప్పటికీ 120 టన్నులు కూడా ఉత్పత్తి చేయలేని స్థితిలో ఉందంటూ ఆందోళన చేశారు.

జులై 10న కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

జులై 10న దేశ వ్యాప్త కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడమే కాకుండా తాజాగా అధికారంలోకి వచ్చాక అమలుకు సన్నాహాలు చేయడం దుర్మార్గమన్నారు.

ఐదు రోజుల పనికాలం మరో ఏడాది పొడిగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సెక్రటేరియట్, హెచ్‌ఒడిల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఐదు రోజుల పనిదినాలను మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 27వ తేదీ నుండే ఈ ఉత్తర్వు అమల్లోకి రానుందని పేర్కొంది. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సచివాలయాన్ని వెలగపూడి తరలించారు. ఆ సమయంలో ఎక్కువ మంది ఉద్యోగులు తమ కుటుంబాలు హైదరాబాద్‌లో ఉంటున్నాయని, పిల్లలూ అక్కడే చదువుకుంటున్నారని, కొన్ని మినహాయింపులు ఇవ్వాలని కోరారు. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం వారంలో ఐదురోజుల పనిదినాన్ని అమలు చేసింది. సోమవారం నుండి శుక్రవారం వరకే పనిదినాలుగా ప్రకటించింది. అప్పటి నుండి ప్రతి ఏడాదీ దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. గతేడాది జూన్‌లో దీన్ని ఏడాదికాలం పొడిగించారు. ఈ నెల 30వ తేదీతో గడువు ముగుస్తుండటంతో మరో ఏడాది పొడిగించారు. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులు వెంకట్రామిరెడ్డి, రామకృష్ణ, నాపా ప్రసాద్, యువి కృష్ణయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.



బొలీవియాలో మరో సైనిక కుట్ర

- ప్రజా మద్దతుతో తిప్పికొట్టిన ఆర్సె ప్రభుత్వం
- కుట్రకు పాల్పడిన ఆర్మీ జనరల్ అరెస్టు
- కొత్త మిలటరీ కమాండర్ నియమాకం
- ఆర్సె ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించిన రష్యా, చైనా

లాపాజ్: బొలీవియాలో వామపక్ష ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు సైన్యం పన్నిన కుట్రను బొలీవియా ప్రజలు ఓడించారు. బుధవారం తిరుగుబాటుకు యత్నించిన సైనిక జనరల్ జువాన్ జునైగాను బర్తరఫ్ చేసి, వెంటనే అరెస్టు చేయడం, ఆయన స్థానంలో కొత్త సైనిక కమాండర్‌ను నియమించడం చకచకా జరిగిపోయాయి. అధ్యక్షుడు ఆర్సె ప్రభుత్వ ప్యాలెస్ నుంచి జాతి నుద్దేశించి మాట్లాడుతూ సైన్యం కుట్రను బొలీవియా ప్రజలు ఓడించారని ప్రకటించారు. బుధవారం మధ్యాహ్నం మంత్రివర్గం సమావేశం కావడానికి ముందు ప్రభుత్వ ప్యాలెస్‌ను జనరల్ జునైగా నేతృత్వంలోని వందలాది మిలిటరీ బలగాలు చుట్టుముట్టి, యుద్ధ ట్యాంకర్‌తో ప్రధాన ద్వారం తలుపులను బద్దలు కొట్టి లోపలికి దౌర్జన్యంగా ప్ర.వేశించారు. ఆ వెంటనే జునైగా ఒక ప్రకటన చేస్తూ జైలు వద్ద మిలిటరీ మిగతా 5లో

భాషా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

- పిడిఎఫ్, యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర, గిరిజన షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న సవర, ఆదివాసీ మాతృభాషా వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో 1,454 గిరిజన పాఠశాలల్లో 1,327 మాతృభాషా ఉపాధ్యాయు లు స్థానిక భాషలో బోధిస్తున్నారని తెలిపారు. 2024-25 సంవత్సరానికి రెన్యువల్ చేసి కొనసాగించాలని కోరారు. విద్యా సంవత్సరంలో 12 నెలలకు సరిపడా బడ్జెట్ కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఆదిమ తెగ గిరిజనుల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఈ భాషా వలంటీర్లను కొనసాగించడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మాతృభాషా ఉపాధ్యాయ సంఘం నాయకులు సవర ఆనందరావు, మత్రి చిట్టిబాబు, వెంకటేష్, పి కుమారి, పి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దళితులపై పెత్తందార్ల దాడి

- ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో దళితులపై అదే గ్రామానికి చెందిన పలువురు పెత్తందారులు దాడి చేశారు. ఈ ఘటనలో ఐదుగురు దళితులకు గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వాం గ్రామానికి చెందిన 14 మంది దళితులకు 1970లో అప్పటి ప్రభుత్వం 23 ఎకరాలకు సంబంధించి డి-పట్టాలు ఇచ్చింది. అంతకు ముందు వరకు ఆ భూమిని పెత్తందారులు సాగు చేస్తుండేవారు. వారి నుంచి ప్రభుత్వం భూమిని తీసుకొని దళితులకు ఇచ్చింది. అప్పటి నుంచి దళితులంతా ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిని ఎలాగైన లాక్కునేందుకు పెత్తందారులు ప్రయత్నించడంతో దళితులకు, పెత్తందారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెత్తందారులు ఆ భూమికి సమీపంలో ఉన్న భూముల సర్వే నెంబరు వేసి కోర్టు నుంచి ఇటీవల ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చి దళితులను సాగు చేయనివ్వకుండా అడ్డుపడ్డారు. పదిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో దళితులంతా పొలంలో వరి నారు పోశారు. గురువారం పొలంలో పని చేసుకుంటున్న వారిపై ఒక్కసారిగా పెత్తందారులు కర్రలతో దాడి చేశారు. మహిళలని చూడకుండా అమానుషంగా వ్యవహరించారు. ఈ ఘటనలో ఐదుగురు దళితులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం నాయకులు వై.మన్మధరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం దళితులందరూ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇదే అదునుగా పెత్తందారులు కొంతమంది ఎస్‌టిలను వెంటబెట్టుకొని వెళ్లి దళితులపై కౌంటర్ కేసు పెట్టారు. ఈ ఘటనను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగునాయుడు ఖండించారు. దాడి చేసిన పెత్తందారులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు రక్షణ కల్పించాలని అధికారులను, పోలీసులను కోరారు. దళితుల సాగులో ఉన్న భూమిని వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో దళితులపై జరిగిన దాడిని ఎపి వ్యవసాయకార్మిక సంఘం, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు గురువారం వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి వేర్వేరు ప్రకటనలో ఖండించారు.



దళితులపై దాడి చేస్తున్నపెత్తందారులు



గాయపడిన దళిత మహిళ రేగిడి దుర్గ



పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రతీకార చర్యలుండవు

- అభివృద్ధే అజెండాగా ముందుకు
- పోలీసుశాఖలో ఖాళీల భర్తీకి చర్యలు
- హోంమంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధే అజెండాగా ముందుకు వెళ్తున్నామని, ఎక్కడా ప్రతీకార చర్యలు, కక్షసాధింపులకు పాల్పడటం లేదని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అనిత హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటిసారి మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా డిజిపి ద్వారకా తిరుమలరావు, ఇతర సీనియర్ అధికారులు హోంమంత్రికి శుభాకాంక్షలు చెబుతూ సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు, గంజాయి నిర్మూలన, పోలీస్ సంక్షేమం, పోలీస్‌శాఖలోని ఖాళీలు, మహిళలకు రక్షణ వంటి కీలకాంశాలపై పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ అనేది కక్ష సాధింపు చర్యలకు కాదన్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన అధికారులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. కేవలం బందోబస్తుకే వాడారు తప్ప శాంతిభద్రతల కోసం ఎక్కడా వినియోగించలేదన్నారు. ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. పోలీసు అకాడమీ, గ్రేహౌండ్ అకాడమీలకు కేంద్రం నుండి నిధులొచ్చినా గత ప్రభుత్వం పూర్తిచేయలేక పోయిందని అన్నారు. విశాఖపట్నం జిల్లాలోని ఓ పోలీస్ స్టేషన్ రేకుల షెడ్డులోనే నడుస్తోందన్నారు. గంజాయి రవాణా రాష్ట్రంలో బాగా పెరిగిందని, నేషనల్ క్రైం రికార్డుల్లో రాష్ట్రాన్ని మూడో స్థానంలోకి తెచ్చారని విమర్శించారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటిగే ఈ అంశంపై ఉపసంఘం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. 100 రోజుల ప్రణాళిక పెట్టుకుని గంజాయిని నిర్మూలిస్తామని తెలిపారు. సచివాలయాల్లోని మహిళా పోలీసులకు ఎలాంటి శిక్షణ లేకుండా తీసుకున్నారని, వారిని ఎలా వాడుకోవాలనే అంశంపై చర్చిస్తున్నామని అన్నారు. ప్రజలు ధైర్యంగా స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో ఆడపిల్లల అదృశ్యం ఘటనలు చాలా వున్నాయని, ఫిర్యాదులతో ఎవరైనా వస్తే వారిని కించపరిచేలా మాట్లాడొద్దని సూచించామన్నారు.

కొత్తగా నాలుగు అతిసార కేసులు నమోదు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో కొత్తగా నాలుగు అతిసార కేసులు నమోదయ్యాయి. జగ్గయ్యపేట ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నలుగురు అతిసార బాధితులు చేరారు. వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పాము ప్రిన్సి, జగ్గయ్యపేటకు చెందిన భూక్య వెంకటేశ్వర్లు, వలపట్ల సాయి, తెలంగాణ రాష్ట్రం బోనకల్లు మండలం సీతాపురం గ్రామానికి చెందిన ముత్తవరపు రాజమ్మ డయేరియా బారినపడి ఆస్పత్రిలో చేశారు. ఇదే ఆస్పత్రి నుండి ఆరుగురు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో మొత్తం పది మంది చికిత్స పొందుతున్నారు. కొత్తగా నమోదైన నలుగురితో కలిపి ఇప్పటి వరకు జగ్గయ్యపేట ప్రాంతంలో అతిసారబారిన పడిన సంఖ్య 116కు చేరింది. వీరిలో 94 మంది కోలుకుని వివిధ ఆస్పత్రుల నుండి డిశ్చార్జి అయ్యారు. మరో 18 మంది విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎన్.అనిల్ కుమార్ తెలిపారు.

తూర్పుగోదావరి, విశాఖలో భారీ వర్షాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ, విజయవాడలో భారీ వర్షాలు పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరంలో భారీ వర్షం కురిసింది. కాకినాడ జిల్లాలో పెద్దాపురం, సామర్లకోట, తాళ్లరేవు, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రావులపాలెం, రామచంద్రపురం, మండపేట, ఆలమూరు మండలాల్లో తేలిక పాటి జల్లులు పడ్డాయి. ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. దీంతో సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని మత్స్యకారులకు అధికారులు సూచించారు. విజయవాడలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ జల్లులు పడ్డాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో కుండపోత వర్షం కురిసింది. మూడు రోడ్ల జంక్షన్, గుంటసీమ రోడ్డుపైకి నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కించుమండ, గోరాపూర్, చాపరాయి గెడ్డలు పొంగి ప్రవహించాయి. అరకులోయ, అనంతగిరి, సీలేరు ప్రాంతాల్లోనూ భారీ వర్షం పడింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోనూ వర్షం కురిసింది.

శాస్త్రీయంగానే నీటి వనరుల వినియోగం

- జియో ట్యాగింగ్ చేయాలి
- కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్‌గౌబా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శాస్త్రీయ ప్రణాళికల ఆధారంగా నీటి వనరులను వినియోగించాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ రాజీవ్‌గౌబా అభిప్రాయపడ్డారు. నీటి వనరులను జియో ట్యాగింగ్ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం జలశక్తి అభియాన్‌పై అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకులు, కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యదర్శులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గౌబా మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అన్నీ నీటి వనరుల వివరాలను కూడా సిద్ధం చేయాలని అన్నారు. ఉపాధి హామి పథకం, కాంపా, ఫైనాన్స్ కమిషన్ తదితర పథకాల కింద లభించే నిధులను నీటి సంరక్షణ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా గత ఏడాది అమృత్ సరోవర్ కార్యక్రమం కింద రూ. 75 వేలకు పైగా కొత్త నీటి వనరులను నిర్మించినందుకు ప్రధాన కార్యదర్శులను ఆయన అభినందించారు. ఈ సంవత్సరం 'నారీ శక్తి సే జలశక్తి అభియాన్' ఇతివత్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేసి నీటి నిర్వహణలో వారికి శిక్షణ ఇవ్వాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాష్ట్రాలను కోరారు. నీటి వినియోగంపై నిర్ణయం తీసుకోవడంలో మహిళల పాత్ర పెరగాలని అభిప్రాయపడ్డారు. గ్రామీణ, పట్టణ నీటి సరఫరా కోసం రాష్ట్రాలు సమగ్ర అపరేషన్, నిర్వహణ విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు. సరిగ్గా క్లోరినైజేషన్ చేసి నాణ్యమైన తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. వర్షపు నీటి సంరక్షణ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలనీ, పట్టణ ప్రాంతాల్లోని నీటి వనరుల ఆక్రమణలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నీటి వనరులకు ఆధారమైన చెరువులు, కుంటలలో పూడిక తీయటం, శుభ్రపరచడం, భూగర్భజలాల రీఛార్జ్ కోసం పాడుబడిన బోర్‌వెల్‌లను పునరుద్ధరించడం, నీటి వనరులను జియో ట్యాగింగ్ చేయడం, పరీవాహక ప్రాంతాలలో అటవీ పెంపకం, చిన్న నదుల పునరుజ్జీవనం వంటివి జలశక్తి అభియాన్‌లో ప్రధానమైన అంశాలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఇతర అధికారులు పాల్గొన్నారు

నీట్ స్కామ్‌లో ఇద్దరిని అరెస్టు చేసిన సిబిఐ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కేసులో సిబిఐ గురువారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసింది. పాట్నాకు చెందిన మనీష్ ప్రకాష్, అశుతోష్ నీట్ పేపర్ లీకేజి పాల్పడినట్లుగా గుర్తించి, వారిని సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. వారు పేపర్‌ని లీక్ చేయడమే గాకుండా.. విద్యార్థులు చదువుకునేందుకు సురక్షిత గృహాలను కూడా ఏర్పాటు చేసినట్లు సిబిఐకు చెందిన సీనియర్ అధికారి తెలిపారు. తాము లీక్ చేసిన పేపర్, దానికి సమాధానాల ఆధారంగా విద్యార్థులు నీట్ పరీక్షకు సిద్ధమయ్యేందుకు అశుతోష్ ఇంటికి విద్యార్థులను మనీష్ ప్రకాష్ తన కారులోనే తరలించినట్లు చెప్పారు. వీరిద్దరినీ కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు అధికారి తెలిపారు.

నెల్లూరు జైలుకు పిన్నెల్లి

- 14 రోజుల రిమాండ్ విధించిన మాచర్ల కోర్టు

ప్రజాశక్తి - మాచర్ల, నెల్లూరు

రెండు హత్యయత్నం కేసులలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మాచర్ల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బుధవారం సాయంత్రం నరసరావుపేటలో ఆయనను అరెస్టు చేసి అర్ధరాత్రి 11.30 గంటల తరువాత మాచర్ల కోర్టులో పోలీసులు హాజరు పరిచారు. విచారణ అనంతరం రిమాండ్ విధించగా గురువారం తెల్లవారుజామున పోలీసుల భారీ బందోబస్తు మధ్య పిన్నెల్లిని నెల్లూరు జైలుకు తరలించారు. గత నెల 13న పోలింగ్ సందర్భంగా ఇవిఎంల ధ్వంసం, టిడిపి కార్యకర్తలపై దాడి ఘటనల్లో పిన్నెల్లిపై మొత్తం నాలుగు కేసులు నమోదయ్యాయి. మాచర్ల అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తరుపున న్యాయవాదులు హజరై వారి వాదనలు వినిపించారు. ఇవిఎం ధ్వంసం, మహిళను దూషించిన కేసులలో బెయిల్ మంజూరుకాగా సిఐ నారాయణస్వామి, నంబూరు శేషగిరిరావు కేసులలో 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ తీర్పునిచ్చారు.

పోలీసుల సమక్షంలోనే దాడి చేసిన పిన్నెల్లి

పిన్నెల్లిని బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో మాచర్ల కోర్టులో హాజరుపర్చిన సమయంలో ఆయన అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కోర్టు వద్దకు వచ్చారు. అదే సమయంలో పిన్నెల్లి అరెస్టుతో సంతోషం వ్యక్తం చేస్తూ టిడిపి కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. ఈ సమయంలో టిడిపికి చెందిన కొమెర శివ అనే కార్యకర్త కోర్టు ఆవరణంలోకి వెళుతున్న పిన్నెల్లికి ఎదురుగా నిలబడటంతో అతనిపై పిన్నెలి దాడి చేశారు. గురువారం సాయంత్రం కొమెర శివ ఫిర్యాదుతో పిన్నెల్లిపై మరో కేసు నమోదైంది.

ఫోన్ ట్యాపింగ్ నిందితుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు తిరుపతన్న, భుజంగరావు, ప్రణీత్‌రావుకు నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ పిటిషన్లపై బుధవారమే వాదనలు ముగియగా.. న్యాయస్థానం గురువారం తీర్పు వెల్లడించింది. తాము బెయిల్ పిటిషన్ వేసినప్పుడు కోర్టులో ఛార్జిషీట్ లేదని నిందితుల తరపు న్యాయవాది వాదించారు. కేసులో అరెస్టయిన 90 రోజుల్లో ఛార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్ బెయిల్ ఇవ్వొచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు చెబుతున్నాయని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టులో ప్రస్తావించారు. 90 రోజుల్లోనే తాము ఛార్జిషీట్ వేశామని, వివరాలు సరిగా లేవని తిప్పి పంపడంతో తిరిగి మళ్లీ వేసినట్టు పోలీసుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఛార్జిషీట్ తిప్పి పంపినంత మాత్రాన ఛార్జిషీట్ వేయనట్లు కాదన్నారు. పోలీసుల వాదనలతో ఏకీభవించిన కోర్టు.. బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

రానున్న 3 నెలలు అప్రమత్తం

- డయేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలి
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- వైద్యారోగ్యశాఖ కమిషనరు వెంకటేశ్వర్
- రాష్ట్రంలో సురక్షితంగా లేని నీటి వనరులు 271

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న మూడు నెలలు డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్లో ఉన్న వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డయేరియా నిరంతరం పర్యవేక్షణకు డైరెక్టరు స్థాయి అధికారితో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డయేరియా ప్రబలిన సమాచారం వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సురక్షితంగా లేని నీటి వనరులను తనిఖీ చేసి ధ్రువీకరించాలని వైద్యారోగ్యశాఖ జిల్లా అధి2కారులను ఆదేశించారు. ప్రబలిన తరువాత హడావుడి చేయడం కంటే ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన రోగుల వివరాలూ తీసుకోవాలని, మొత్తం సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి తెలపాలని ఆదేశించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారులు నీటి పరీక్షలు సరిగ్గా చేస్తున్నదీ లేనిదీ మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్రంలో సురక్షితంగా లేని నీటి వనరులు 271 ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాటిని పరీక్షించి ప్రత్యామ్నాయ నీటి వనరులను అందుబాటులోకి తేవాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందని వివరించారు. నీటి పరీక్షలు సక్రమంగా చేయని సిహెచ్‌ఒలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పర్యవేక్షణ లోపం ఉన్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ డైరెక్టర్‌కూ సూచించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి గ్రస్తులకు నెలాఖరులోపు గుర్తింపు కార్డులను సిద్ధం చేయాలని, జులై ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

సున్నా ప్రసవాలున్న తిరుపతి, శ్రీకాకుళం జిల్లాల డిఎంహెచ్‌ఒలు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిహెచ్‌సిల్లో ప్రసవాలు జరిగేలా గర్భిణులకు తగిన అవగాహన కల్పించడంతోపాటు వారిలో నమ్మకాన్ని కలిగించేలా మెడికల్ ఆఫీసర్లు తమవంతు బాధ్యత నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టరు పద్మావతి, అడిషనల్ డైరెక్టరు అనిల్‌కుమార్, నేషనల్ హెల్త్‌మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడండి

- మంత్రి లోకేష్‌కు ఆప్టా లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కోరింది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఐదేళ్ల నుంచి తగ్గుతూ వస్తోందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు గురువారం లేఖ రాశారు. జిఓ 117 వల్ల 3, 4, 5 తరగతులు చేయటం ద్వారా ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే ఉన్నాయని, ఒకరు, లేదంటే ఇద్దరు టీచర్లు మాత్రమే అక్కడ ఉంటున్నారని తెలిపారు. దీనివల్ల తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించడం లేదని చెప్పారు. దీనివల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గిపోతుందని పేర్కొన్నారు. జిఓ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతులను మరలా ప్రాథమిక పాఠశాలల్లోకి తరలించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారికి మాత్రమే అమలు చేయాలని కోరారు.

ఎపి ఎడ్ సెట్, పిజి సెట్ ఫలితాలు విడుదల

- బాలికలదే పైచేయి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రవ్యాప్తంగా బిఇడి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎడ్‌సెట్ - 2024 ప్రవేశ పరీక్షా ఫలితాలను గురువారం ఉదయం విశాఖలోని ఎడ్‌సెట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణా కన్వీనర్ ఆచార్య టి.వెంకటకృష్ణ విడుదల చేశారు. ఈ నెల 8న రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో 52 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు.10805 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 9365 మంది హాజరయ్యారు. వారిలో 9183 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణతా శాతం 98.05గా నమోదైంది. మొదటి 10 ర్యాంకులు సాధించిన వారిలో ఎనిమిది మంది అమ్మాయిలు ఉండగా ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. మెథడాలజీ వారీగా ఫలితాలను పరిశీలిస్తే ఫిజికల్ సైన్స్‌లో అత్యధికంగా 99.59 శాతం, గణితంలో 99.46 శాతం, ఇంగ్లీషులో 98.56 శాతం, సోషల్ స్టడీస్‌లో 97.04 శాతం, బయలాజికల్ సైన్స్‌లో 96.86 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 99.62 శాతంతో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా, ఏలూరు జిల్లా 99.56 ఉత్తీర్ణతతో రెండో స్థానంలోనూ, గుంటూరు జిల్లా 99.12 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారిలో పురుషులు 98.08 శాతం మంది, మహిళలు 98.05 శాతం మంది ఉన్నారు. ఫలితాలను విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఎడ్‌సెట్ 2024 కోర్ కమిటీ సభ్యులు ఆచార్య పాల్ డగ్లస్, ఆచార్య లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఎపి ఎడ్‌సెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఆచార్య వెంకటకృష్ణ

ఎపి పిజి సెట్ ఫలితాలు

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి పిజిసెట్ - 2024 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జూన్ 10 నుంచి 13 వరకు మూడు రోజులపాటు 34 సబ్జెక్టులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పరీక్ష నిర్వహించింది. ఎపిలో 24 కేంద్రాల్లోనూ, హైదరాబాద్ రీజియన్‌లో ఒక కేంద్రంలోనూ పరీక్ష జరిగింది. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫలితాలను త్వరలో ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. 33 సబ్జెక్టులకుగాను 33,865 మంది దరఖాస్తు చేసుకోగా 29,908 మంది హాజరయ్యారు. వారిలో 18,467 మంది అర్హత పొందారు. ఉత్తీర్ణతా శాతం 61.75గా నమోదైంది. పురుషుల విభాగంలో 6,736 మంది (59.30 శాతం), మహిళల విభాగంలో 11,731 మంది (63.24) అర్హత సాధించారు.



అమరావతి నిర్మాణానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు చెక్కును అందిస్తున్న కిరణ్, శైలజ, విజయేశ్వరి

భావి తరాలకు రామోజీ స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

పోరాటం చేసేవారని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు తెలియాలని భావించారని తెలిపారు. కష్టాలు ఎన్ని వచ్చినా తన విలువలను వదులుకోలేదన్నారు. అమరావతిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.

మీడియా స్వేచ్ఛకోసం పోరాడారు : ఎన్ రామ్



రామోజీరావు విలువలుతో కూడిన ఇన్వెస్టిగేషన్ జర్నలిజాన్ని నమ్మేవారని ద హిందూ పూర్వ సంపాదకులు ఎన్ రామ్ అన్నారు. 1980వ దశకంలో ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా రామోజీరావు మీడియా స్వేచ్ఛకోసం రాజీ పడకుండా పోరాడారని తెలిపారు. బోఫోర్స్ కుంబకోణంపై వచ్చిన వార్తలపై నాటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మీడియాను లక్ష్యంగా చేసుకొని పరువునష్టం బిల్లును తెచ్చిందని తెలిపారు. ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా రామోజీరావు ఆబిల్లుకు వ్యతిరేకంగా పోరాడితే రాజీవ్‌గాంధీ ఆ బిల్లును ఉపసంహరించుకున్నారని చెప్పారు. రామోజీ రావు మీడియా రంగాన్ని గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లేలా మొదటిసారి జిల్లా టాబ్లాయిడ్‌లను తీసుకొచ్చారన్నారు.

రాజధానికి రూ.10కోట్ల విరాళం అందించిన కిరణ్

రాజధాని అమరావతి నిర్మాణం కోసం రామోజీరావు కుటుంబ సభ్యులు రూ.10కోట్ల విరాళాన్ని అందించారు. ఈ చెక్కును చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు అందజేశారు. తన తండ్రి పాటించిన విలువలను త్రికరణ శుద్ధిగా పాటిస్తామనిఆయన కుమారుడు కిరణ్ ఈ సందర్భంగా అన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం జీవితాంతం రామోజీరావు పరితపించారని చెప్పారు. ఆయన నెలకొల్పిన విలువలను ముందుకు తీసుకుపోతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పార్థసారథి, కొల్లు రవీంద్ర,ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సినీ ప్రముఖులు జయసుధ, మురళీమోహన్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ఎస్‌ఎస్ రాజమౌళి, ఎంఎం కిరవాణీ తదితరులు మాట్లాడారు. మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 21 నాటికి అన్న క్యాంటీన్లు సిద్ధం

- ఉన్నతాధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో సెప్టెంబరు 21 నాటికి అన్న క్యాంటీన్లను సిద్ధం చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి నారాయణ ఆదేశించారు. అలాగే తాగునీటి వ్యవస్థ కలుషితం కాకుండా ప్రతిరోజూ శ్యాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు సెప్టెంబరు నాటికి సిద్ధం చేసి వుంచాలన్నారు. చిన్నచిన్న మరమ్మతులుంటే పూర్తి చేయాలన్నారు. అలాగే అన్న క్యాంటీన్‌లకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు సర్వీస్ ప్రొవైడర్‌లను టెండర్ల ద్వారా గుర్తించాలన్నారు. కీలకమైన రెవెన్యూపై అధికారులు దృష్టిసారించాలన్నారు. ఇందుకు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు కృషి చేయాలన్నారు. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన తీసుకొచ్చే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. మహిళలకు జీవనోపాధులు పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కీలకమైన తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేయాలన్నారు. సమీక్షలో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజదండం స్థానంలో రాజ్యాంగ ప్రతిని అమర్చండి : ఎస్‌పి ఎంపి ఆర్.కె చౌదరి

న్యూఢిల్లీ : పార్లమెంటులో రాజదండం స్థానంలో రాజ్యాంగ ప్రతిని అమర్చండి అని సమాజ్‌వాదిపార్టీ ఎంపి ఆర్‌కె చౌదరి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. ఆయన ఈ మేరకు ఓంబిర్లాకు లేఖ రాశారు. 'దేశంలో ప్రజాస్వామ్యం కోసం రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నాం. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ఒక చిహ్నం. బిజెపి గత ప్రభుత్వంలో రాజ దండాన్ని స్పీకర్ ఛైర్‌కు పక్కన గోడకు అమర్చారు. సెంగోల్ అనే తమిళ పదం నుంచి వచ్చింది. సెంగోల్‌కి అర్థం దండం. రాజదండం అంటే రాజు చేతి కర్ర. మనం రాజరిక పాలన నుంచి ఎప్పుడో విముక్తుల మయ్యాం. ప్రస్తుతం ఓటు అర్హత కలిగి ఉన్న స్త్రీ, పురుషులు ఓటువేసి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. దేశంలో పాలన రాజ్యాంగంలో నడవాలా? లేదా రాజదండంతో నడవాలా? రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని అమర్చి.. రాజ్యాంగాన్ని రక్షించండి' అని స్పీకర్‌కు రాసిన లేఖలో చౌదరి పేర్కొన్నారు.

టిడిపి అరాచకాలపై చర్యలు తీసుకోండి

- డిజిపిని కోరిన వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ 15 రోజుల్లో విధ్వంసమే లక్ష్యంగా వైసిపి కార్యకర్తలపై, వైసిపి కార్యాలయాలపై ఆ పార్టీ కార్యకర్తలు అరాచకాలతో దాడులకు పాల్పడుతున్నారని, తక్షణం వారిపై చర్యలు తీసుకుని వైసిపి కార్యాలయాలకు భద్రత కల్పించాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు డిజిపి ద్వారకా తిరుమలరావుకు గురువారం వైసిపి ఫిర్యాదు చేసింది. అనంతరం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందునుండే ఈ విధ్వంసాలకు వ్యూహ రచన చేశారని విమర్శించారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఇప్పటి వరకు 14 జిల్లాల్లో తమ పార్టీ కార్యాలయాలపై దాడులు చేసి భయానక వాతావరణం సృష్టిస్తున్నారని తెలిపారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వేధింపులకు గురిచేయడం తగదని అన్నారు. పోలీస్ కస్టడీతో కోర్టుకు వెళు తున్న పిన్నెల్లిపై టిడిపి కార్యకర్తలు దాడులకు పాల్పడటం అరాచకమని అన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా వేదికను కూల్చిందన్న కక్షతో తమ పార్టీ కార్యాలయాలను కూల్చి వేశారని ఆరోపించారు.

ఒకటిన ఇంటివద్దే పెన్షన్లు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ పంపిణీ చేయాలి
- 29వ తేదీనాడే నగదు డ్రా చేసుకోవాలని సిఎస్ ఆదేశం
- ప్రభుత్వానికి మాట రాకూడదని హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎస్ నీరబ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పథకం అమల్లో భాగంగా జులై ఒకటోతేదీనే లబ్ధిదారులు అందరికీ ఇంటివద్దే పెన్షన్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాదు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ విధివిధానాలపై గురువారం సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటో కేటగిరీలోని వృద్ధులు, వితంతువులతోపాటు లబ్ధిదారులందరీ ఒకటోతేదీనే పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. జులై నెల నాలుగువేలతోపాటు మూడు నెలల ఏరియర్స్ మూడువేలు కలిపి మొత్తం ఏడువేల రూపాయలు ఒకేసారి ఇచ్చేయాలని ఆదేశించారు. 65,18,496 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.4399.89 కోట్లను విడుదల చేసిందని చెప్పారు. వీరిలో 64.75 లక్షల మంది రాష్ట్రంలోనే ఉంటున్నారని, బయట చదువుకునేవారు, దివ్యాంగ విద్యార్థులకు డిబిటి పద్ధతిలో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ సొమ్మును 29వ తేదీనే బ్యాంకుల నుండి డ్రా చేసుకోవాలని సూచించారు. ఒకటోతేదీ ఉదయం ఆరుగంటల నుండి పంపిణీ ప్రారంభం కావాలని సూచించారు. దీనికోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతోపాటు అవసరమైతే ఇతర శాఖల ఉద్యోగులనూ ఉపయోగించుకోవాలని, ఒక్కో ఉద్యోగి 50 గృహాల చొప్పున పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒక్కరోజులోనే పంపిణీ మొత్తం పూర్తి చేయాలని, అనివార్య కారణాల వల్ల ఎవరైనా మిగిలిపోతే రెండోరోజు పూర్తిచేయాలని తెలిపారు. అధార్ బయోమెట్రిక్, ఫేషియల్, ఐరిస్, ఆర్‌బిఐఎస్ అధారంగానే పింఛన్ల పంపిణీ ఉండాలని పేర్కొన్నారు. పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ సర్టిఫికెట్‌ను కూడా జారీచేయాలని చెప్పారు. ప్రభుత్వానికి ఎటువంటి మాట రాకూడదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శులు సౌరబ్‌గౌర్, సత్యనారాయణ, అధికారులు శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ @ 79వేలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు కొనుగోళ్ల మద్దతుతో రోజుకో నూతన రికార్డ్‌ను సృష్టిస్తున్నాయి. గురువారం బిఎస్ఇ సెన్సెక్స్ 79వేలు, నిఫ్టీ 24వేల పాయింట్ల ఎగువన నమోదై.. మరో కీలక మైలురాయిని అధిగమించాయి. సెన్సెక్స్ ఉదయం ఒత్తిడిలోనే ప్రారంభమైనప్పటికీ.. ఆ తర్వాత పుంజుకుని.. తుదకు లాభాల్లో ముగిసింది. చివరికి 569 పాయింట్ల లాభంతో 79,243కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 176 పాయింట్లు పెరిగి 24,044.50 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టిపిసి, జెఎస్‌డబ్ల్యు స్టీల్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి. మరోవైపు ఎల్అండ్‌టి, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, మారుతీ సుజుకీ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

జియో భారీ బాదుడు

టారిఫ్ ప్లాన్లపై 25 శాతం పెంపు



న్యూఢిల్లీ : ఊహించినట్లుగానే పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే రిలయన్స్ జియో తన రీఛార్జ్ ప్లాన్లను భారీగా పెంచింది. ముకేష్ అంబానీకి చెందిన ఈ సంస్థ అట్టహాసంగా తొలుత ఉచితంగానే అపరిమిత డాటా పేరుతో మార్కెట్లోకి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా మెల్లగా డబ్బులు వసూలు చేయడం ప్రారంభించింది. తాజాగా గురువారం జియో టారిఫ్ ప్లాన్స్ వ్యయాన్ని భారీగా పెంచుతూ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. జియో కొత్తగా 19 ప్లాన్లు ప్రకటించింది. వాటిలో 17 ప్రీపెయిడ్ ప్లాన్లు కాగా, రెండు పోస్ట్ పెయిడ్ ప్లాన్లు ఉన్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రీపెయిడ్ ప్లాన్లపై సరాసరి 12.5 శాతం నుంచి గరిష్టంగా 25 శాతం వరకు ధరలు పెంచేసింది.

ఫీచర్ ఫోన్లలో ఎక్కువగా ఉపయోగించే ప్రాథమిక ప్లాన్ 28 రోజులకు గాను రూ.155 చెల్లించాల్సి ఉండగా.. ఈ ప్లాన్ ధరను ఇప్పుడు రూ.189కి పెంచేసింది. ప్రతీ రోజు 1జిబితో 28 రోజుల కాలపరిమితి కలిగిన ప్లాన్ వ్యయాన్ని రూ.209 నుంచి రూ.249కు పెంచింది. ప్రస్తుతం 239 ప్లాన్‌ను రూ.299కు చేర్చింది. రెండు నెలల గడువు ప్లాన్‌ను రూ.479ని రూ.579కి పెంచింది. వీటితోపాటు కొత్తగా రిలయన్స్ జియో పలు సర్వీసులు ప్రారంభించింది. జియో సేఫ్, జియో ట్రాన్స్ లేట్. క్వాంటం సెక్యూర్ కమ్యూనికేసన్ ఆఫ్ పర్ కాలింగ్, మెసేజింగ్, ఫైల్ ట్రాన్స్ ఫర్ తదితరాల కోసం రూ.199 చెల్లించాలి. కొత్త టారిఫ్ ప్లాన్లు జూలై మూడో తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. జియో రీచార్జ్ ప్లాన్ల ధరల పెంపునతో వినియోగదారులపై అదనపు భారం పడటంతో వారు ఆందోళన వ్యక్తం అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా వినుకొండ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అదుపు తప్పి చెట్టుకు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన సోమేసి బాలగంగాధర్‌శర్మ (78) తన చెల్లెలు పెళ్లి రోజు నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి మూడురోజుల క్రితం బళ్లారికి కారులో వెళ్లారు.

బుధవారం రాత్రి గుంటూరుకు తిరుగు పయనమయ్యారు. గురువారం తెల్లవారుజామున పల్నాడు జిల్లా వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెం వద్ద కారు అదుపు తప్పి హైవే పక్కనున్న చెట్టును ఢీ కొట్టింది. బాలగంగాధర్ శర్మతో పాటు ఆయన భార్య యశోద (69), డ్రైవర్ నిర్మలరావు (48) అక్కడికక్కడే మృతి చెందారు. బాలగంగాధర్‌శర్మ కుమారుడు నాగశర్మ, కోడలు నాగసంధ్య, మనవరాలు అనుపమ, మనవడు కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు వినుకొండ ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్సానంతరం గుంటూరుకు తరలించారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

ప్రజల కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల కనీస అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకెళుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. ప్రజలు సుఖంగా జీవించాలంటే వారు ఉన్న ప్రదేశంలో రోడ్డు, నీరు, డ్రైన్, కరెంట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లో హౌసింగ్, రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్, విద్యుత్ తదితర శాఖల అధికారులు, కలెక్టర్ ఎం.హరినారాయణన్‌తో కలిసి గురువారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పనితీరుపై క్షుణ్ణంగా ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ .. పార్టీలకతీతంగా ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. అందుకు తగిన విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. అధికారులపై ఎటువంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని తెలిపారు. త్వరలోనే మరోసారి పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి ఆయా శాఖల ద్వారా ప్రజలకు అందాల్సిన సంక్షేమాభివృద్ధిపై చర్చిస్తామని చెప్పారు. విద్యుత్, మైన్స్‌పై మరోసారి క్షుణ్ణంగా చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, నారాయణ విద్యా సంస్థల జిఎం విజయభాస్కర్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్యం ఖర్చు పెంపునకు ప్రతిపాదన

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాల ఖర్చుల నిమిత్తం గతంలో ఇస్తున్న రూ. 5000 ను రూ. 10 వేలకు పెంచేలా ప్రతిపాదనలను సిఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు దేవాదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నెల్లూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తిరుమల నుంచే రాష్ట్రంలోని ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ, సింహాచలం, అన్నవరం, అరసవెల్లి, ఒంటిమిట్ట ఆలయాలు అత్యంత ప్రసిద్ధి చెందినవని, ఈ ఆలయాల్లో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు.

ఇసుక, మద్యం, పర్యాటకంపై కొత్త పాలసీలు?

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో అత్యంత కీలకమైన రంగాల్లో కొత్త పాలసీలు తయారుచేసేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రధానంగా ఇసుక, మద్యం, పర్యాటక రంగాల్లో తమదైన ముద్రతో కొత్త విధానాలు తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కీలక శాఖల అధికారులతో ముఖ్యమంత్రి కార్యాలయం చర్చించినట్లు సమాచారం. ఇవి కొలిక్కి వస్తే త్వరలోనే నూతన విధానాలను ప్రకటించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఇసుక, మద్యం అమ్మకాలపై అనేక విమర్శలు వస్తున్నాయి. సాధారణ ప్రజలకు ఇసుక లభ్యత ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. 2014-19 మధ్య కాలంలో ఉచిత ఇసుక విధానం అమలు చేయగా, 2019 నుంచి ఇసుక ధరలు గణనీయంగా పెరిగిపోయి సామాన్యులకు అందని పరిస్థితి నెలకొంది. అందుకే ముందుగా దీనిపై దృష్టి సారించాలని ప్రభుత్వం భావిస్తోందని అధికారులు చెబుతున్నారు. అలాగే మద్యం కూడా తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రయివేటు దుకాణాల స్థానంలో ప్రభుత్వమే అమ్మకాలు ప్రారంభించడం, ఎక్కడ చూసినా నకిలీ మద్యమే అమ్మకాలు జరిగినట్లు విమర్శలు రావడం తెలిసిందే. గత ప్రభుత్వం ఓటమి చెందడానికి మద్యం కూడా ఒక కారణమన్న భావన వ్యక్తమైంది. అందుకే కొత్త ప్రభుత్వం మద్యం పాలసీపైనా దృష్టి సారించాలని భావిస్తోంది. ఇక రాష్ట్ర ఆదాయానికి కీలకంగా కనిపించే పర్యాటకాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు కొత్త విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆదాయ సముపార్జనే లక్ష్యంగా ఈ విధానాలు ఉంటాయని ఒక అధికారి తెలిపారు.

ఏజెన్సీలో పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఏజెన్సీలో జిసిసి ఆధ్వర్యంలో పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లాలో 221 రేషన్ మొబైల్ వాహనాల ద్వారా ఆదివాసీ గ్రామాలకు రేషన్ పంపిణీ చేస్తున్నారని, ఇది ఉపశమనం కలిగించే చర్యని తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం పాత పద్ధతిని రద్దు చేస్తున్నట్లు వస్తున్న వార్తలతో ఆదివాసీల్లో ఆందోళన నెలకొందన్నారు. రేషన్ బియ్యం కోసం గతంలో 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఆదివాసీలకు పాత పద్ధతి ద్వారానే పంపిణీ ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రస్తుతం అల్లూరి జిల్లాలోని 221 మొబైల్ వాహనాల ద్వారా 442 మంది ఉపాధి పొందుతున్నారని, పాత పద్ధతిని రద్దు చేస్తే వారందరికీ ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. అప్పటి ప్రభుత్వం మొబైల్ వాహనాలకు సంబంధించి రూ.ఆరు లక్షల ఖరీదుకుగాను 90 శాతం సబ్సిడీతో 2026 వరకు మొబైల్ వాహనాలు నడిపేందుకు అగ్రిమెంట్ చేసుకుని ఆ వాహనాలకు సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తూ వచ్చిందని, పాత పద్ధతిని రద్దు చేస్తే వాహనాలకు కట్టాల్సిన రుణం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో నలుగురు దుర్మరణం

ఏలూరులో తల్లీ, కొడుకు.. పశ్చిమగోదావరిలో భార్యాభర్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి గురై నలుగురు మృతి చెందారు. ఏలూరు జిల్లాలో బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తల్లీ, కొడుకు మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ తీగలు తగిలి భార్యభర్తలు మృత్యువాత పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఈదర రావిచెట్టు సెంటర్ వద్ద దళితవాడలో దొండపాటి నాగరత్నం (62) తన ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు పక్షవాతంతో బాధపడుతున్నారు. గురువారం కూలి పనికి వెళ్లిన నాగరత్నం వర్షంలో తడిచి ఇంటికి వచ్చారు. తడి బట్టలను తీగలపై ఆరేస్తుండగా దానికి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. తల్లిని కాపాడే ప్రయత్నంలో ఆమె పెద్ద కుమారుడు రామదాసు కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో తల్లీ, కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. రామదాసు భార్య సుభాషిణి ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో భార్యభర్తలు గట్టెం వెంకన్న (60), అన్నపూర్ణ (55) టిఫిన్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం టిఫిన్ కోసమని అన్నపూర్ణ ఇడ్లీ పిండిని ఆడించేందుకు గ్రైండర్ స్విచ్ ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురయ్యారు. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన వెంకన్న సైతం విద్యుదాఘాతానికి గురై ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. సిఐ సుబ్రహ్మణ్యం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




వెంకన్న, అన్నపూర్ణ (ఫైల్)

జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు

- ఫార్మాక్సిల్ డిజి ఉదయ్

హైదరాబాద్ : జనరిక్ ఔషధ ఎగుమతుల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మాక్సిల్) డైరెక్టర్ జనరల్ ఉదయ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీనియర్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్నతో కలిసి ఉదయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ.. 2023 నుంచి 2029 వరకు ఈ రంగంలో 10 బిలియన్ డాలర్ల (రూ.83వేల కోట్లు) రెవెన్యూకు అవకాశాలున్నాయన్నారు. ఇందుకు 15 కీలక ఔషధాలు మద్దతును అందించనున్నాయని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మేలో భారత ఔషధ ఎగుమతులు 8.85 శాతం పెరిగి రూ.4.73 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు.



ఆగస్ట్‌లో ఐపెక్స్..

ఫార్మెక్సిల్ ఆధ్వర్యంలో 10వ ఎడిషన్ ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ ఐపెక్స్ జరుగనుందని ఉదయ భాస్కర్ తెలిపారు. ఆగస్ట్ 28 నుంచి 30 వరకు గ్రేటర్ నోయిడాలోని ఐఇఎంఎల్‌లో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సంపాదకీయం

నిరంకుశ పోకడలు

భారతీయ జనతా పార్టీకి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ముకుతాడు వేసినా, దాని నిరంకుశ ధోరణిలో ఏ మార్పూ కనపడటం లేదు. 18వ లోక్‌సభకు సభాపతి, ఉప సభాపతి ఎన్నిక విషయంలో ఆ పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. లోక్‌సభలో సభాపతిగా అధికార పక్ష సభ్యుడిని, ఉప సభాపతిగా ప్రతిపక్ష సభ్యుడిని నియమించుకోవడం ఒక సాంప్రదాయంగా వస్తోంది. రాజ్యాంగంలోని 93వ అధికరణం ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. "లోక్‌సభ తన సభ్యుల్లో ఒకరిని స్పీకర్‌గా, మరొకరిని డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నుకుంటుంది. స్పీకరు ఎన్నిక తేదీని రాష్ట్రపతి నిర్ణయిస్తారు. అదే రోజు డిప్యూటీ స్పీకరు ఎన్నిక కూడా జరుగుతుంది." అని పేర్కొంది. తొలి లోక్‌సభ నుంచి 16వ లోక్‌సభ వరకూ ఈ రాజ్యాంగ నిర్దేశం అమలైంది. ప్రారంభంలో అధికార పక్ష సభ్యుల నుంచే స్పీకరు, డిప్యూటీ స్పీకర్ల ఎన్నిక జరిగేది. 1969లో మేఘాలయకు చెందిన ప్రతిపక్ష సభ్యుడు గిల్బర్ట్ స్వేల్ డిప్యూటీ స్పీకరుగా నియమితులయ్యారు. అప్పటినుంచి పాలక పార్టీ నుంచి కాక వేరే పార్టీ సభ్యుడిని ఉప సభాపతిగా ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

మోడీ రెండోసారి ప్రధాని అయిన తరువాత - అనేక ప్రజాస్వామిక విధానాలకు తిలోదకాలిచ్చినట్టే- డిప్యూటీ స్పీకరు ఎన్నికకు కూడా మంగళం పాడేశారు. అనేక అంశాలపై ప్రశ్నించి, ప్రస్తావించి, చర్చించాల్సిన పార్లమెంటును అధికార పక్ష బల ప్రయోగశాలగా మార్చేశారు. ప్రతిపక్ష సభ్యులను బలవంతంగా సభనుంచి గెంటేసి, మందబలంతో ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకొచ్చే దుస్సాహస చర్యలకు పాల్పడ్డారు. ఈ నిరంకుశ నిర్వాకాలు నిరాటంకంగా కొనసాగించటానికి వీలుగా ఉప సభాపతి స్థానాన్ని భర్తీ చేయడం మానేశారు. డిప్యూటీ స్పీకరు పదవిని ప్రతిపక్షానికి కేటాయించే సాంప్రదాయం జనతా ప్రభుత్వం, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాల్లోనూ, వాజపేయి హయాంలోనూ, తరువాత యుపిఎ కాలంలోనూ కొనసాగింది. 2014లో మోడీ తొలిసారి ప్రధాని అయినప్పుడూ అన్నా డిఎంకెకు చెందిన తంబి దురై డిప్యూటీ స్పీకరుగా ఉన్నారు. 2019లో బిజెపి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సంఖ్యాబలం సాధించాక- డిప్యూటీ స్పీకరు స్థానానికి చాప చుట్టేసింది. గత ఐదు దశాబ్దాల సాంప్రదాయాన్ని పాటించాలనే ఇండియా బ్లాకు పార్టీలు పట్టుబట్టాయి. అయినా, మొండిగా వ్యవహరించటం మోడీ సర్కారుకే చెల్లింది. గడచిన పదేళ్ల నిరంకుశ ధోరణినే ఇప్పుడూ అనుసరించటం 2024 ప్రజల తీర్పును ఉల్లంఘించటమే!

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రాంతీయ పార్టీలు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. గడచిన పదేళ్లలో బిజెపితో ప్రత్యక్ష భాగస్వామ్యం లేకపోయినా అన్ని సందర్భాల్లోనూ వంత పాడిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కూడా కమలాన్ని బలపర్చటం విచారకరం. శాసనసభలో తనకు 10 శాతం సభ్యులు లేకపోయినా ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఘోషిస్తున్న ఆ పార్టీ- లోక్‌సభలో అధికార పార్టీ కొమ్ము కాయడం ద్వంద్వ వైఖరి. రాష్ట్ర ప్రజలిచ్చిన తీర్పు నుంచి కూడా ఆ పార్టీ ఎలాంటి గుణపాఠమూ తీసుకున్నట్టు లేదు. ప్రతిపక్షం బలపడితేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్న వాస్తవాన్ని మరవరాదు. టిడిపి, జనసేన కూడా బిజెపికి మద్దతిచ్చి, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి మచ్చ తెచ్చాయి. డిప్యూటీ స్పీకరు పదవి ప్రతిపక్షానికి ఇవ్వాలని గట్టిగా కోరి ఉండాల్సింది. ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని నాటి కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా రద్దు చేస్తే, తెలుగు ప్రజలు, దేశంలోని కాంగ్రెసేతర పార్టీలూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించి, విజయం సాధించాయి. అలాంటి ఒరవడిని కొనసాగించాల్సిన టిడిపి ... మోడీ షాల నిరంకుశ పోకడలకు వంత పాడితే ప్రజాస్వామ్యానికి నష్టం. అంతేగాక విధానపరంగా నిక్కచ్చిగా నిలబడకుండా వారసత్వాన్ని కాపాడడం సాధ్యం కాదు. ఇప్పటికైనా బిజెపి డిప్యూటీ స్పీకరు స్థానాన్ని ప్రతిపక్షానికి కేటాయించి, పార్లమెంటరీ సాంప్రదాయాన్ని గౌరవించాలి. అలా చేసేలా టిడిపి, జనసేన, వైసిపి తమ వంతు పాత్ర నిర్వహించాలి. తద్వారా తెలుగు ప్రజల ప్రజాస్వామ్య కాంక్షను బలపర్చాలి.

మహనీయుల మాట



వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్టు,
నిరంతరం నేర్చుకొనేవారే
ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

అసమర్ధ పాలకులు-ఆగని కుంభకోణాలు

సమస్య



డి. రాము

నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రపంచ స్థాయి విద్యను అందిస్తామంటున్న బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పట్ల తన ప్రాథమిక బాధ్యతను మరిచిపోతున్నది. భారత దేశంలో కాలేజి అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల సాధన అనేది 12 సంవత్సరాల పాటు విద్యార్థులు చదివిన చదువు, సాధించుకున్న గ్రేడ్లు, వారి అనుభవాల ప్రకారం జరగడం లేదు. మూడు గంటల వ్యవధిలో సాగుతున్న తప్పుదారి పట్టించే ప్రయత్నాలపై ఆధారపడి ఉంటున్నది. దీనిని బిజెపి పెంచి పోషిస్తున్నది. అందుకే ఈ కుంభకోణాలన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, బీహార్‌లలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఈ మధ్య కాలంలో ఉత్తరప్రదేశ్ పోలీసు నియామకాల్లో కూడా స్కాములు జరిగాయి.

నీట్, నెట్, మెయిన్స్ వంటి ప్రవేశ పరీక్షలకు పోటీ చాలా తీవ్రంగా ఉంటుంది. భారత దేశంలో పాఠశాల వ్యవస్థ బలహీనంగా ఉంది. నేషనల్ స్టాటిస్టిక్స్ అండ్ శాంపిల్ సర్వే ఆఫీస్ ప్రకారం దీని మూలంగా ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒకరు కోచింగ్ నిమిత్తం ట్యూషన్ సెంటర్లలో చేరుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఇది 90 శాతంగా ఉంది. ఈ కోచింగ్ సెంటర్లు 2008 నుండి 2013 మధ్య కాలంలో బాగా పెరిగాయి. ఇప్పుడు మరింతగా పెరుగుతున్నది. 2020 నుండి 2024 వరకు నీట్ పరీక్షలో పాల్గొన్న వారి సంఖ్యను చూస్తే ప్రతీ ఏడాది ఇవి ఎంతగా పెరుగుతున్నాయో తెలుస్తుంది. 2020లో 15,97,435 మంది నీట్ పరీక్ష రాయగా, 2024లో 23,33,297 మంది రాశారు. పెరుగుతున్న ఈ పోటీని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు ఉపయోగించు కుంటున్నాయి. విద్యార్థుల మధ్య పెరుగుతున్న పోటీ కోచింగ్ సెంటర్ల మధ్య పోటీని పెంచుతుంది. ఈ మార్కెట్ ను అందిపుచ్చుకోవడంలో ఉత్తరాది రాష్ట్రాలు ముందున్నాయి. అందులో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో కాన్పూర్, గోరఖ్‌పూర్ వంటి ప్రాంతాలు దీనిని హస్తగతం చేసుకున్నాయి. అందుకే ప్రతి సంవత్సరం ఈ పరీక్షలలో ఉత్తరప్రదేశ్ నుండి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొంటారు. ఈ సంవత్సరం నీట్ కు కూడా ఉత్తరప్రదేశ్ నుండే అత్యధికంగా 3,39,125 మంది పాల్గొన్నారు. అక్కడ విద్యార్థులు ఇరుకు గదుల్లో చాలీచాలని తిండి తింటూ అహర్నిశలు కష్టపడి చదువుతుంటారు. పెరుగుతున్న ఈ పోటీ, ఉద్యోగాల కొరత కోచింగ్ సెంటర్లకు అధిక ఫీజులు అందిస్తుంటే రాజకీయ నాయకులు స్కాములు చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. దీనికి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం తోడవుతున్నది.



> అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వంపైనా న్యాయ వ్యవస్థపైనా ఒత్తిడి చేస్తున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజకీయ నాయకులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదు. ఈ ఏడాది మన రాష్ట్రంలో 140 సెంటర్లలో 68,022 మంది విద్యార్థులు నీట్-యుజి పరీక్ష రాశారు. వారి గురించి ఒక్క నాయకుడూ మాట్లాడటం లేదు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు, ఆ యా పార్టీల నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు ఈ నీట్ స్కామ్‌పై స్పందించాలి. ఎన్‌టిఎ రద్దు చెయ్యాలనే డిమాండ్‌ను బలపరచాలి. ప్రవేశ పరీక్షలు పాత పద్ధతిలోనే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకొనేలా రాష్ట్రాల హక్కుల రక్షణకై విద్యార్థులంతా ఐక్యంగా మరిన్ని పోరాటాలు నిర్వహించాలి.

దేశాన్ని కుదిపివేసిన 'వ్యాపమ్' కుంభకోణం

బొగ్గు గనుల కుంభకోణం, మైనింగ్ కుంభకోణం కంటే ఘోరమైనది, మోసపూరితమైనది వ్యాపమ్ కుంభకోణం. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ స్కామ్ 2013లో బహిర్గతం అయింది. ప్రభుత్వం పోలీసులతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ఈ కుంభకోణంలో అభ్యర్థుల నుండి 2,00,000 వరకు వసూలు చేసే లాభదాయకమైన వ్యాపారాన్ని సాగించిన ఘనత ఇండోర్ వైద్యుడు జగదీప్ సాగర్‌ది. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోని తన కోచింగ్ సెంటర్ అడ్డాగా ఇటువంటి దారుణాలకు పాల్పడి కోట్ల రూపాయలు సంపాదించాడు. ఇతగాడు 13,00,000 రూపాయలతో నింపిన పరుపుపై నిద్రించాడని 'హిందుస్తాన్ టైమ్స్'లో 'వింటేజ్ వైన్-బెడ్ ఆఫ్ క్యాష్' అనే శీర్షికతో వచ్చిన నివేదిక తెలిపింది. ఈ స్కామ్ ద్వారా భూమి, విలాసవంతమైన కార్లు, ఆభరణాలను కూడబెట్టాడని పోలీసులు పేర్కొన్నారు. కానీ సాగర్ లాంటి వాళ్లు ఈ కుంభకోణంలో కోకొల్లలు. 2013 నుండి 2015 మధ్య కాలంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ 2,235 మందిని అరెస్టు చేసింది. 1860 మందిని ప్రశ్నించిన తరువాత బెయిల్‌పై విడుదల చేసింది. తీగ కదిపితే డొంకంతా కదిలినట్లు ఒక్కర్ని అరెస్టు చేసి ప్రశ్నిస్తే మొత్తం రాజకీయ నాయకుల గుట్టంతా బయట పడింది. ఈ స్కామ్‌లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కుటుంబ సభ్యులు, ఆరోగ్య, విద్య, మైనింగ్ శాఖలను నిర్వహించిన సీనియర్ మంత్రి లక్ష్మీకాంత్ శర్మ, ఆయన మాజీ సహాయకుడు సందీప్ శర్మ, అప్పటి గవర్నర్‌తో పాటు ఆయన కుమారుడు శైలేష్ యాదవ్‌తో సహా పై నుండి కింది వరకు అందరికి సంబంధాలున్నాయని టాస్క్‌ఫోర్స్ కనిపెట్టింది. దీనిని కప్పిపుచ్చడం కోసం సాక్షులనేవారు లేకుండా చేయడానికి హత్యల పరంపర కొనసాగింది. 2010 నుండి 'వ్యాపమ్' స్కామ్‌తో సంబంధం ఉన్న 40 మందికి పైగా వైద్యులు, వైద్య విద్యార్థులు, పోలీసులు, సివిల్ సర్వెంట్లు అనుమానాస్పద స్థితిలో హత్యలు చేయబడ్డారు. ఇంతటి ఘోరం జరుగుతుంటే...పుట్టిన వారు ఏదో ఒక రోజు చనిపోవాల్సిందేనని, చనిపోయిన వారెవరూ హత్య చేయబడలేదని బిజెపి కప్పిపుచ్చుకుంది.

'వ్యాపమ్'ను మించిన 'డిమ్యాట్' కుంభకోణం

'వ్యాపమ్' కుంభకోణం బయటపడిన రెండు సంవత్సరాల తరువాత 2015లో మళ్లీ మధ్యప్రదేశ్ లోనే (డి.ఎం.ఎ.టి) కుంభకోణం బయట పడింది. డెంటల్ అండ్ మెడికల్ అడ్మిషన్ టెస్ట్ (డి.ఎం.ఎ.టి) అనేది మధ్యప్రదేశ్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. ఈ పరీక్షను అసోసియేషన్ ఫర్ ప్రైవేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ (ఎ.పి.డి.ఎం.సి) నిర్వహించేది. ఇందులో అడ్మిషన్ల స్కామ్ 2006 నుండి జరుగుతున్నదని నిర్ధారణ అయ్యింది. ఇందులో ఒక్కొక్క అభ్యర్థి నుండి 15 లక్షల నుండి కోటి రూపాయల వరకు వసూలు చేశారు. సుమారు రూ.10,000 కోట్ల వరకు స్కామ్ జరిగింది. వ్యాపమ్ కుంభకోణం, డిమ్యాట్ కుంభకోణం ఒకే పద్ధతిలో జరిగాయని మధ్యప్రదేశ్ ప్రొఫెషనల్ ఎగ్జామినేషన్ బోర్డు (ఎం.పి.పి.ఇ.బి) మాజీ డైరెక్టర్ యోగేష్ దర్యాప్తు అధికారులకు చెప్పారు. విచారణ అనంతరం సుప్రీంకోర్టు డిమ్యాట్ కుంభకోణం వ్యాపమ్ కుంభకోణం కంటే అధ్వాన్నంగా ఉందని పేర్కొంది. ఈ కుంభకోణాలన్నింటిలో బిజెపి పాత్ర ఉండటంతో ప్రజల్లో బిజెపిపై తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. దీనిని తప్పుదోవ పట్టించడానికి కేంద్ర ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎం.సి.ఐ నిర్వహించే ప్రీ-మెడికల్ టెస్ట్‌ను ఒకే దేశం-ఒకే పరీక్ష అంటూ నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్‌కు (నీట్) మార్చింది. 2013 నుండి నీట్-యుజి , నీట్-పిజి ని నిర్వహించే బాధ్యత నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టిఎ కు అప్పగించింది. ఎన్‌టిఏకు దీన్ని అప్పగించడంపై అనేక విమర్శలు ఎదురయ్యాయి. ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు ముక్త కంఠంతో వ్యతిరేకించాయి. అనంతరం కేవలం 2 భాషల్లోనే నిర్వహించే ఈ పరీక్షను 13 భాషల్లో నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఎన్‌టిఎ దీన్ని నిర్వహించడంలో పూర్తిగా విఫలమైంది. పరీక్ష నిర్వహణ మొదలుకొని ఫలితాల విడుదల వరకు అనేక అవకతవకలు జరుగుతున్నాయి. 2020లో మధ్యప్రదేశ్‌లో చింద్వారా జిల్లాకు చెందిన ఒక యువతి కేవలం ఆరు మార్కులు వచ్చాయని ఆత్మహత్య చేసుకుంది. అదే సంవత్సరం మృదుల్ రావత్‌కు 720 మార్కులకు 329 వచ్చాయి. అతను ఎన్‌టిఎ అధికారులను సంప్రదించగా 650 మార్కులతో ఎస్‌టి విభాగంలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. ఒక సంవత్సరం తెలంగాణలో సాంకేతిక లోపం వలన విద్యార్థులు చివరి 40 ప్రశ్నలు కోల్పోయారు. ఇప్పుడు ఏకంగా పేపర్ లీకేజీకి పాల్పడింది. విమర్శలు వస్తున్న సందర్భంలో ఎటువంటి లోపాలు జరగవని, పరీక్షా పత్రాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని చెప్పిన ప్రధాని ఇప్పుడు స్పందించడమే లేదు.

'నీట్'గా స్కామ్

కుంభకోణాలను అరికట్టడానికి తీసుకు వచ్చిన 'నీట్' ఇప్పుడు అతి పెద్ద కుంభకోణంగా మారింది. ఈ సంవత్సరం నీట్-యుజి పరీక్ష మే 5న 4750 సెంటర్లలో నిర్వహించబడింది. దీనికి దేశవ్యాప్తంగా 23,33,297 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వచ్చాయి. కానీ విద్యా శాఖామంత్రి ధర్మేందర్ ప్రధాన్ మొదట ఎటువంటి అవకతవకలు జరగలేదని చెప్పుకొచ్చారు. తరువాత అక్షయ అనే విద్యార్థిని నీట్ పరీక్ష పేపర్ లీక్ అయిందని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అదేవిధంగా పరీక్ష ముందు రోజు బీహార్‌లో పేపర్ లీక్ చేశారని 14 మందిని అరెస్టు చేయడం జరిగింది. 30 మంది అభ్యర్థుల నుండి 30 నుండి 40 లక్షల రూపాయలు వసూలు చేశారని కనుగొన్నారు. గుజరాత్ లోని ఫారిన్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ అధినేత పురుషోత్తమ్ రాయ్, అధ్యాపకుడు తుషార్ భట్ సహకారంతో అభ్యర్థుల నుండి రూ. 10 లక్షలు వసులు చేసి పేపర్ లీక్ చేశాడని వార్తలు వినిపించాయి. చివరికి ఫలితాల్లో ఎన్నడూ లేని విధంగా 69 మందికి 720/720 వచ్చాయి. అందులో ఒకే సెంటర్‌లో 8 మంది టాప్ ర్యాంక్‌తో నిలిచారు. చాలా మందికి అసాధారణంగా 718, 719 మార్కులు వచ్చాయి. దీనితో ఈ ఆరోపణలన్నీ నిజమయ్యాయి. తప్పని పరిస్థితిలో మొదట ఎటువంటి అవకతవకలు జరగలేదని చెప్పిన విద్యా శాఖా మంత్రి రెండు చోట్ల అవకతవకలు జరిగాయని ఒప్పుకున్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో గ్రేస్ మార్కులు వచ్చిన 1563 మందికి మరలా జూన్ 23న పరీక్ష నిర్వహించారు. కానీ ఈ పరీక్షకు కేవలం 813 మందే హాజరయ్యారు. నీట్ కౌన్సిలింగ్ జులై 6న ఉంటుందనగా సుప్రీంకోర్టు ఈ స్కామ్‌పై విచారణను జులై 8కి వాయిదా వేసింది. దీనితో కొంత మంది కౌన్సిలింగ్ రెండు రోజులు పొడిగించాలని కోరినప్పటికీ వారి పిటిషన్లు తోసిపుచ్చింది. నీట్-యుజి స్కామ్ నుండి బయట పడక ముందే నీట్-పిజి పేపర్ లీక్ అయ్యిందని చెప్పి 24 గంటల్లోనే నీట్-పిజి పరీక్షను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ కుంభకోణాల వలన దేశంలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు ఎక్కువగా నష్టపోతున్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారు. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నీట్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వంపైనా న్యాయ వ్యవస్థపైనా ఒత్తిడి చేస్తున్నాయి. కానీ మన రాష్ట్రంలోని రాజకీయ నాయకులకు కనీసం చీమ కుట్టినట్లు కూడా అనిపించడం లేదు. ఈ ఏడాది ఎ.పి లో 140 సెంటర్లలో 68,022 మంది విద్యార్థులు నీట్-యుజి పరీక్ష రాశారు. వారి గురించి ఒక్క నాయకుడూ మాట్లాడటం లేదు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు, ఆ యా పార్టీల నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యులు ఈ నీట్ స్కామ్‌పై స్పందించాలి. ఎన్‌టిఏ రద్దు చెయ్యాలనే డిమాండ్‌ను బలపరచాలి. ప్రవేశ పరీక్షలు పాత పద్ధతిలోనే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకొనేలా రాష్ట్రాల హక్కుల రక్షణకై విద్యార్థులంతా ఐక్యంగా మరిన్ని పోరాటాలు నిర్వహించాలి.

(వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్ : 9705545164)

అసాంజే - ముగింపు కాదు, ఆరంభం !

వ్యాఖ్య

వికీలీక్స్ సంస్థ స్థాపకుడు, అమెరికా వంచన, దుర్మార్గాలను సాధికారికంగా బయటపెట్టి పెను సంచలనం సృష్టించిన జూలియన్ అసాంజే పద్నాలుగు సంవత్సరాల తరువాత ప్రవాసం, నిర్బంధం నుంచి విడుదల అయ్యాడు. ఇది హర్షించాల్సిన పరిణామం. అమెరికా సర్కార్‌తో కుదిరిన రాజీలో భాగంగా తన మీద మోపిన గూఢచర్య నేరారోపణను అసాంజే అంగీకరించాడు. దానికి గాను ఐదు సంవత్సరాల జైలు శిక్షను విధించారు. అయితే బ్రిటన్‌లో ఇప్పటికే అంతకంటే ఎక్కువ కాలం జైల్లో ఉన్నందున శిక్షా కాలం పూర్తయినట్లు పరిగణించి వెంటనే విడుదల చేశారు. మాతృభూమి ఆస్ట్రేలియా గడ్డ మీద అడుగు పెట్టాడు. చీమ కూడా చొరరాని, గాలి శబ్దాన్ని కూడా పసిగట్టి పహారా కాసే ఏర్పాట్లున్న అమెరికా నిఘా యంత్రాంగం నుంచి కూడా మిలియన్ల కొద్దీ రహస్య ఫైళ్లను కూడా జర్నలిస్టులు తలచుకొంటే ఎలా సంపాదించగలరో ప్రపంచానికి చాటాడు. తొలుత తన మీద నేరం మోపిన అమెరికాలోని వర్జీనియాలో కాకుండా అమెరికా కామన్‌వెల్త్ లోని పశ్చిమ పసిఫిక్ సముద్రంలోని ఉత్తర మరియానా దీవుల్లో తనపై విచారణ జరపాలని అసాంజే విధించిన షరతును జో బైడెన్ సర్కార్ అంగీకరించింది. తద్వారా తాను అమెరికా గడ్డ మీద కాలు మోపననే మాటను నెగ్గించుకున్నాడు. అసాంజే చర్యల వలన ఎందరికో ముప్పు ఏర్పడిందని, ఎంతో నష్టం జరిగిందని, అతనికి 175 సంవత్సరాల శిక్ష పడుతుందని ఊరూ వాడా నానా యాగీ చేసిన అమెరికా చివరకు నేరం చేసినట్లు అంగీకరిస్తే చాలు వదలివేస్తామని చెప్పింది. ఈ ఉదంతాన్ని మరోసారి అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న డోనాల్డ్ ట్రంప్ ఎలా ఉపయోగించుకుంటాడో చూడాల్సి ఉంది. ఈ ఉదంతంలో ఎవరికి తోచిన భాష్యం వారు చెప్పటానికి అవసరమైన అంశాలు ఉన్నాయి. ప్రపంచంలో రాజీ పడిన అనేక ఉదంతాల్లో ఇది ఒకటి. రాజీ పడిన ప్రతిదీ తప్పు కాదని చరిత్ర రుజువు చేసింది. అందువలన వాటిని పరిగణనలోకి తీసుకోవటం తప్ప అంతకు మించి ఆలోచించాల్సిన అవసరం లేదు.



> ప్రపంచంలో అనేక మంది జర్నలిస్టులు సంచలనాత్మక అంశాలను బయటపెట్టారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. నిజానికి వారి వెనుక ఎందరో ఉన్నారు. అలాంటి వారికి విశ్వాసం కలిగించటమే సదరు జర్నలిస్టుల ప్రత్యేకత అని చెప్పక తప్పదు. అసాంజే ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఆగదు, తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో కోరుకొనేవారికీ కొదవ ఉండదు. అదేమీ దేశద్రోహం కాదు, ప్రజల పక్షాన నిలవటమే. ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దారుణాలను వికీలీక్స్ బయటపెట్టింది. తరువాత సాగిన వాటిని వెలువరించేందుకు ప్రతి ఒక్క జర్నలిస్టూ అసాంజేగా మారాల్సిన అవసరం ఉంది.

ప్రపంచంలో అనేక మంది జర్నలిస్టులు సంచలనాత్మక అంశాలను బయటపెట్టారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. నిజానికి వారి వెనుక ఎందరో ఉన్నారు. అలాంటి వారికి విశ్వాసం కలిగించటమే సదరు జర్నలిస్టుల ప్రత్యేకత అని చెప్పక తప్పదు. చేలేసా మానింగ్ అనేక అమెరికా మిలిటరీ అధికారిణి ద్వారా రహస్య పత్రాలు అసాంజే ఆధ్వర్యంలోని సంస్థకు చేరాయి. ఈ అంశం వెలుగులోకి వచ్చిన తరువాత ఆమె మీద కేసులు మోపి 35 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తే అధ్యక్షుడిగా బరాక్ ఒబామా దాన్ని ఏడు సంవత్సరాలకు తగ్గించటంతో 2017లో జైలు నుంచి విడుదలైంది. తరువాత ఏడాది పాటు జైలు శిక్ష, జరిమాన చెల్లించటానికి సిద్ధపడింది తప్ప అసాంజేకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేందుకు ఆమె నిరాకరించింది. అసాంజేను విడుదల చేయాల్సిందిగా ఐరోపాతో సహా అనేక దేశాలు, సంస్థల నుంచి అమెరికా ప్రభుత్వంపై నానాటికీ ఒత్తిడి పెరుగుతున్న పూర్వ రంగంలో జో బైడెన్ రాజీకి అంగీకరించాల్సి వచ్చింది. అసాంజే ప్రస్తావన వచ్చినపుడల్లా అమెరికా ఇలాంటి దుర్మార్గాల పాల్పడిందా అని నూతన తరాలు తెలుసుకొనేందుకు తోడ్పడింది. అది మరింత నష్టదాయకంగా మారింది. రెండవది రహస్యం అన్న పత్రాలను ముద్రించినందున లేదా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచినందున జరిగిన నష్టం ఏమిటో రుజువు చేసేందుకు అమెరికా దగ్గర ఎలాంటి సాక్ష్యాలు లేవు. కేసును విచారించిన న్యాయమూర్తి కూడా అదే చెప్పాడు. తన భర్త కేసుకు సంబంధించిన వివరాలను సమాచార స్వేచ్ఛ హక్కు కింద అమెరికా నుంచి సంపాదించి లోకానికి వెల్లడించాల్సిందిగా అసాంజే భార్య స్టెల్లా యావత్ జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. కేసు నడిచినంత కాలం భర్తతో పాటు నిలిచిన ధీరవనితగా ఆమె చరిత్రకెక్కినందుకు అమెను అభినందించాల్సిందే. తన భర్త నేరాన్ని అంగీకరించారంటే దాని అర్థం జర్నలిజానికి కట్టుబడి ఉన్నందుకే అన్నారు. ఈ కేసులో జర్నలిజాన్ని ఒక నేరంగా మార్చిన...వార్తల సేకరణ, ప్రచురణను నేరంగా పరిగణించబడిన వాస్తవాన్ని గ్రహించి కేసు తీరుతెన్నులను బహిర్గత పరచాలని ఆమె విజ్ఞప్తి చేసింది. అసాంజే ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఆగదు, తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో కోరుకొనేవారికీ కొదవ ఉండదు. అదేమీ దేశద్రోహం కాదు, ప్రజల పక్షాన నిలవటమే. ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దారుణాలను వికీలీక్స్ బయటపెట్టింది. తరువాత సాగిన వాటిని వెలువరించేందుకు ప్రతి ఒక్క జర్నలిస్టూ అసాంజేగా మారాల్సిన అవసరం ఉంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

నగరాల్లో నీటి కొరత

అభిప్రాయం

దాదాపు గత ఐదు దశాబ్దాలుగా ధరిత్రీ దినోత్సవం అని, ప్రపంచ జల దినోత్సవం అని, పర్యావరణ దినోత్సవం అని ప్రపంచ దేశాలతో సహా మన దేశంలోనూ జరుపుకుంటున్నాం. కానీ ఆ దినోత్సవాల ఆశయాల దిశగా పయనం ఉన్నదా... అంటే దాదాపు లేనట్లే కనపడుతుంది. దీంతో భూమి మీద అనేక విపత్తులు సంభవిస్తున్నాయి. అడవుల నరికివేత, వివిధ రకాల కాలుష్యాలు పెరగటం, ఆధునీకరణ పేరుతో కాంక్రీట్ నగరాలు జనాభాతో కిటకిటలాడడం, ఫెర్టిలైజర్లు, పెస్టిసైడ్స్ వలన భూగర్భ జలాల కలుషితం కావడం, అవసరాలకు మించి భూగర్భ జలాలు తోడి వేయటం, ప్లాస్టిక్ వాడకం పెరగటం మొత్తం జల వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తున్నది. దీనికి తోడు, చెరువులు కుంటలు బావులు అక్రమాలకు గురవడం వల్ల భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి పడిపోయినాయి. దీంతో మొత్తం మెట్రో నగరాల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. బిందెడు నీళ్ల కోసం గంటల తరబడి వేచి చూసే పరిస్థితి. దీనికి కారణం మానవ తప్పిదాలే అని ఇకనైనా అందరూ గుర్తించాలి. గ్రహించాలి.

దక్షిణ ఆఫ్రికా రాజధాని కేప్ టౌన్ ఎంత నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నదో...ఆ మాదిరిగా మన దేశంలోని చాలా నగరాలు, పట్టణాలు నీటి బాధిత నగరాలుగా ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే బెంగళూరు, చెన్నై, దేశ రాజధాని న్యూఢిల్లీ మంచినీటి కోసం ఎంత ఇబ్బంది పడుతున్నాయో చూస్తూనే ఉన్నాం. దీనికి ప్రధాన కారణం భూగర్భ జలాలు అడుగంటి పోవడమే. నీటి వినియోగం పెరగడం. బోరుబావులు ఎక్కువగా వేయడం. మరీ ముఖ్యంగా గ్లోబల్ వార్మింగ్ వలన వాతావరణ మార్పులు సంభవిస్తూ, కాలాలు గతులు తప్పుతున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో ఉత్తర భారతదేశంలో పగటి ఉష్ణోగ్రతలు భారిగా పెరుగుతున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో కూడా గత 120 సంవత్సరాల రికార్డు ఉష్ణోగ్రతలను బ్రేక్ చేసి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి. భవిష్యత్తులో మరింత నీటి ఎద్దడిని ఎదుర్కొనే పరిస్థితులు కనపడుతున్నాయి.



ఇకనైనా ప్రభుత్వాలు, స్థానిక పాలనా యంత్రాంగం, నీటి వనరుల శాఖ తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ముఖ్యంగా అడవులు రక్షించుకోవాలి. మొక్కలు పెంచాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. బోరు బావులుపై నియంత్రణ ఉంచాలి. పట్టణ పరిపాలన శాఖ, టౌన్ ప్లానింగ్, నీటి సరఫరా వ్యవస్థ పకడ్బందీగా పనిచేయాలి. ప్రతీ పౌరుడు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలి. నీటిని వృథా చేయరాదు. చెరువులు, కుంటలు పూడికలు తీయాలి. అక్రమాలను తొలగించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియమనిబంధనలను అనుసరించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. ప్రకృతి వనరుల దోపిడిపై నిఘా పెంచాలి. వ్యర్థాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి. వలసలు నియంత్రణ చేయగలిగితే చాలావరకూ సమస్యలు పరిష్కారం అవుతాయి. ముఖ్యంగా ప్రభుత్వాలు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో, సహకారంతో పనిచేయటం ద్వారానే నీటి సమస్యలను అధిగమించగలం. అదే విధంగా రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ సక్రమంగా జరగాలి. నదులు కాలుష్యం తగ్గించాలి. పూడికలు తీయాలి. కాలువలు చెరువుల నిర్వహణ కోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్ని ప్రాంతాల్లో లభించే విధంగా పరిశ్రమలు, వ్యవస్థలు నెలకొల్పటం ద్వారా, ఒకే చోట జనాభా కేంద్రీకరణ తగ్గించటం ద్వారా మెట్రో నగరాల్లో జనాభా పెరుగుదలను నియంత్రించగలుగుతాం. తద్వారా అనేక సమస్యల నుంచి బయట పడవచ్చు. తగు విధంగా ఇకనైనా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

- రావుశ్రీ


సమరుద్దీన్, అబ్దుల్ జలీల్

అసోంలో ఇద్దరు ముస్లిముల కాల్చివేత

- ఫారెస్టు గార్డు ఘాతుకం

న్యూఢిల్లీ : అసోంలోని నాగావ్ జిల్లాలో ఇద్దరు ముస్లిములను ఫారెస్టు గార్డు కాల్చిచంపిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. లభోవా వన్యప్రాణుల అభయారణ్యంలో అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించడంతో ఈ నెల 22న ఫారెస్టు గార్డు కాల్పులకేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ కాల్పుల్లో నాగావ్ జిల్లా డింగ్‌బారిచాపారి గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు అబ్దుల్ జలీల్ (40), సమరుద్దీన్ (35) మరణించారు. ఆత్మరక్షణ కోసం ఫారెస్టు గార్డు కాల్పులు జరిపారని పోలీసులు చెబుతుండగా, కావాలనే కాల్చిచేశారని పౌర సంస్థలు విమర్శిస్తున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించినట్లు అసోం సిఎం హిమంత బిశ్వశర్మ తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని, బాధిత కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే నూరుల్ హుదా డిమాండ్ చేశారు. ఆయన మృతుల ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ముస్లింలపై విషపూరిత దాడులు

- ఖండించిన సిపిఎం
- నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుండి దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లింలపై ఏక రీతిన పెద్దయెత్తున జరుగుతున్న దాడులను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో పశువులను రవాణా చేస్తున్న ముగ్గురు ముస్లిం యువకులను ఆవుల స్మగ్లర్లుగా ముద్ర వేసి గో గూండాలు కొట్టి చంపేశారు.. ఉత్తరప్రదేశ్‌లో దొంగతనం చేశాడన్న ఆరోపణలపై ఓ ముస్లింను ఇదే విధంగా కొట్టి చంపేశారు. మధ్యప్రదేశ్‌లోని మండలాలో ఫ్రిజ్‌లో గొడ్డు మాంసం ఉంచారన్న వార్తలు వచ్చిన 24 గంటల్లోనే ముస్లింలకు చెందిన 11 ఇళ్లధ్వంసం చేశారు. లక్నోలో ముస్లింలు ఎక్కువగా వుండే అక్బర్‌నగర్‌లో రివర్ ఫ్రంట్ నిర్మాణం పేరుతో ఇళ్లను బుల్డోజర్లతో కూల్చేయడంతో వెయ్యి కుటుంబాలు దాకా వీధినపడ్డాయి.. గుజరాత్ వడోదరలో ముఖ్యమంత్రి గృహ నిర్మాణ పథకం కింద అల్పాదాయ వర్గ గృహ సముదాయంలో ముస్లిం మహిళకు ఫ్లాట్ కేటాయించినందుకు ఆ దగ్గరలో ఉన్న హిందువులు బహిరంగంగానే నిరసన తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని నహన్‌లో . ఈద్ అల్ అదా సందర్భంగా ఆవును బలి ఇచ్చారని ఆరోపిస్తూ ముస్లింల దుకాణాన్ని లూటీ చేసి, ధ్వంసం చేశారు. గో వధకు పాల్పడ్డారంటూ కేసు కూడా పెట్టారు. ఈ విధంగా 16 మంది షాపు యజమానులను బలవంతంగా దుకాణాలు వీడి పారిపోయేలా చేశారు. ఢిల్లీలోని సంగమ్ విహార్‌లో ఓ ప్రార్థనా స్థలానికి సమీపంలో గో కళేబరం దొరికిందంటూ హిందుత్వ సంస్థల సభ్యులు ఉద్రిక్తపూరిత ప్రసంగాలు చేయడంతో అక్కడ నివాసం వుంటున్న వారు భయంతో పారిపోతున్నట్లు వార్తలొచ్చాయి. .. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదురు దెబ్బలు తగిలినప్పటి నుంచి మతోన్మాద దాడులు మరింత ముమ్మరమయ్యాయి.. . బిజెపి, హిందుత్వ మతతత్వ శక్తులు మతపరమైన సమీకరణ కోసం ఉద్రిక్తపూరిత దాడులతో పేట్రేగిపోతున్నాయి. ఈ మితవాద శక్తుల కుతంత్రాలు, కుటిల పన్నాగాల పట్ల అత్యంత అప్రమత్తంగా వుండాలని సిపిఎం పొలిట్‌బ్యూరో తన అన్ని శాఖలకు పిలుపునిచ్చింది. వాతావరణాన్ని చెడగొట్టేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసే ఇటువంటి విషపూరితమైన దాడులకు, చేష్టలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పొలిట్‌బ్యూరో కోరింది.

మైనారిటీలపై పెరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలు

- భారత్‌లో పరిస్థితులపై యుఎస్ సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన



న్యూఢిల్లీ : భారత్‌లోని మైనారిటీల పట్ల అనుసరిస్తున్న విధానాల పట్ల అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ వర్గానికి వ్యతిరేకంగా మత మార్పిడి నిరోధక చట్టాలు, ద్వేషపూరిత ప్రసంగాలు, గృహాలు, ప్రార్థనా స్థలాల కూల్చివేతలలో పెరుగుదల ఉన్నదని ఆయన అన్నారు. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై వార్షిక స్టేట్ డిపార్ట్‌మెంట్ నివేదికను విడుదల చేసిన సందర్భంగా బ్లింకెన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆ సమయంలో, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కూడా మత స్వేచ్ఛను రక్షించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. "దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో పది రాష్ట్రాలు అన్ని మతాలకు సంబంధించిన మత మార్పిడులను నియంత్రించే చట్టాలను కలిగి ఉన్నాయి. వీటిలో కొన్ని రాష్ట్రాలు వివాహం కోసం బలవంతపు మత మార్పిడులకు వ్యతిరేకంగా ప్రత్యేకంగా జరిమానాలు విధిస్తున్నాయి" అని అంతర్జాతీయ మత స్వేచ్ఛపై 2023 నివేదిక భారత్‌లోని పరిస్థితులపై పేర్కొన్నది. మతపరమైన మైనారిటీ గ్రూపులకు చెందిన కొందరు సభ్యులు హింస నుంచి వారిని రక్షించటానికి, మతపరమైన మైనారిటీ సమూహాల సభ్యులపై నేరాలను పరిశోధించటానికి, వారి మతం, విశ్వాస స్వేచ్ఛను రక్షించటానికి ప్రభుత్వ సామర్థ్యాన్ని, సుముఖతను సవాలు చేశారు.

పెన్ పింటర్ ప్రైజ్-2024 విజేతగా అరుంధతీ రాయ్



ఢిల్లీ : బుకర్ ప్రైజ్ గ్రహీత, ప్రముఖ రచయిత్రి అరుంధతీరాయ్ ప్రతిష్ఠాత్మకమైన 'పెన్ పింటర్ ప్రైజ్ - 2024 విజేతగా నిలిచారు. ఆమె రాసిన తొలి నవల 'ద గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్'కి ఈ పురస్కారం ప్రకటించారు. 14 సంవత్సరాల క్రితం కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఆమెను ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వ డైరెన్‌లో పని చేసే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఇటీవల అనుమతించడం తీవ్ర విమర్శలకు గురైంది. ఇంగ్లీష్ పెన్ చైర్ రూత్ బోర్త్‌విక్ మాట్లాడుతూ అరుంధతీరాయ్ అంతర్జాతీయ ఆలోచనాపరురాలని, శక్తివంతమైన ఆమె స్వరం మౌనంగా ఉండకూడదని పేర్కొన్నారు. గతంలో సల్మాన్ రష్దీ, మార్గరెట్ అట్‌వుడ్, టామ్ స్టాపర్డ్, కరోల్ ఆన్ డఫీలు పింటర్ బహుమతిని అందుకున్నారు. అక్టోబర్ 10, 2024న బ్రిటిష్ లైబ్రరీ సహ-హోస్ట్ చేసే కార్యక్రమంలో రాయ్ ఈ బహుమతిని అందుకోనున్నారు.

భారత్ హిందూ రాష్ట్రం కాదు

- ఎన్నికల ఫలితాలు దీనినే స్పష్టం చేశాయి : అమర్త్యసేన్



కోల్‌కతా : భారతదేశం 'హిందూ రాష్ట్రం' కాదని లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయని నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ వ్యాఖ్యానించారు. విచారణ జరపకుండా ప్రజలను కటకటాల వెనుక ఉంచడం బ్రిటిష్ కాలం నుండి కొనసాగుతోందని, కాంగ్రెస్ పాలనలో కంటే బిజెపి ప్రభుత్వ హయాంలోనే ఈ ధోరణి అధికంగా ఉన్నదని ఆయన చెప్పారు. 90 సంవత్సరాల వయసు కలిగిన ఆర్థికవేత్త అమర్త్యసేన్ బుధవారం సాయంత్రం అమెరికా నుండి కోల్‌కతా వచ్చారు. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఎయిర్‌పోర్టు వద్ద ఆయన ఓ బెంగాలీ న్యూస్ ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. 'ఎన్నికలు జరిగిన ప్రతిసారీ మార్పు కన్పించాలని మనం కోరుకుంటాం. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో విచారణ లేకుండా ప్రజలను జైల్లో నిర్బంధించడాన్ని మనం చూశాం. ధనికులు, పేదల మధ్య అంతరం పెరిగిపోయింది. అది ఇప్పుడు మరింత పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది' అని అమర్త్యసేన్ తెలిపారు. భారత్ లౌకిక దేశమని, దీనికి లౌకిక రాజ్యాంగం ఉన్నదని, కాబట్టి దేనినైనా అంగీకరించే రాజకీయ లక్షణం ఉండాలని ఆయన అన్నారు. భారతదేశం హిందూ రాష్ట్రమని మార్చాలన్న ఆలోచన సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రంలో కొత్తగా ఏర్పడిన క్యాబినెట్ పాత మంత్రిమండలి నకలేనని వ్యాఖ్యానించారు. 'మంత్రులు అవే శాఖల్లో కొనసాగుతున్నారు. కొద్దిపాటి మార్పులు మినహా రాజకీయంగా శక్తివంతులైన వారు ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నారు' అని చెప్పారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను అమర్త్యసేన్ గుర్తు చేసుకుంటూ... 'నేను యుక్తవయసులో ఉన్నప్పుడు నా బంధువులు అనేక మంది ఎలాంటి విచారణలను ఎదుర్కోకుండానే జైలుకు వెళ్లారు. స్వేచ్ఛావాయువులు పీల్చుకున్న దేశంలో ఇలా జరగకూడదని మేము ఆశించాం. ఈ ధోరణికి అడ్డుకట్టవేయడంలో విఫలమైన నాటి కాంగ్రెస్‌ను కూడా నిందించాల్సి ఉంటుంది. వారు దానిని మార్చలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఇది మరింతగా ప్రబలిపోయింది' అని వివరించారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినప్పటికీ ఫైజాబాద్ లోక్‌సభ స్థానాన్ని బిజెపి కోల్పోవడంపై ఆయన మాట్లాడుతూ దేశ యొక్క నిజమైన గుర్తింపును మరుగుపరచేందుకు ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. 'భారత్‌ను హిందూ రాష్ట్రంగా చిత్రీకరించేందుకు బాగా డబ్బు ఖర్చు చేసి రామమందిరాన్ని నిర్మించడం మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాకూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్‌లు జన్మించిన ఈ దేశంలో జరిగి ఉండకూడదు. నిజమైన భారతీయ గుర్తింపును నిర్లక్ష్యం చేసేందుకు జరిగిన ప్రయత్నంగా దీనిని భావించాలి. దీనిని మార్చాల్సి ఉంది' అని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, ప్రాథమిక విద్య, ప్రాథమిక ఆరోగ్య రక్షణ వంటి రంగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అమర్త్యసేన్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌టిఎకి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : నీట్ ఫలితాల్లో అవకతవకలపై నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)కి సుప్రీంకోర్టు గురువారం నోటీసులిచ్చింది. తదుపరి విచారణ చేపట్టనున్న జులై 8లోగా ఈ నోటీసులపై ఎన్‌టిఎ స్పందించాలని ఆదేశించింది. నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ లెర్నింగ్ యాప్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. మే 5న నిర్వహించిన నీట్ పరీక్షల సమగ్రతపై ఈ పిటిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జూన్ 4న వెల్లడించిన ఫలితాలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులు అభ్యర్థుల ర్యాంకులు, పరీక్షల స్వచ్ఛతపై తీవ్ర ప్రభావితం చూపాయని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రిగ్గింగ్, పేపర్ లీక్‌లపై సిబిఐ కూడా విచారణ చేపడుతోంది.

కొత్త క్రిమినల్ చట్టాల అమలు ఆపండి

- సుప్రీంలో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై స్టే విధించాలని కోరుతూ సుప్రీం కోర్టులో గురువారం ఒక పిటిషన్ దాఖలైంది. ఈ మూడు చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం - 2023 జులై 1 నుండి అమల్లోకి రావాల్సి వుంది. అంజలి పటేల్, ఛాయా మిశ్రా ఈ రిట్ పిటిషన్ వేశారు. క్రిమినల్ ప్రొసీజర్‌ను, న్యాయ వ్యవస్థను ప్రక్షాళనం చేస్తున్న ఈ మూడు కొత్త చట్టాల సాధ్యాసాధ్యాలను అంచనా వేసేందుకు తక్షణమే నిపుణుల కమిటీని నియమించాలని వారు సుప్రీంకోర్టును కోరారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సిఆర్‌పిసి), భారతీయ సాక్ష్యాధారాల చట్టం స్థానంలో ఈ మూడు కొత్త చట్టాలను తీసుకొస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రతిపక్షాల సభ్యులను సస్పెండ్ చేసి, పార్లమెంట్‌లో సవివరమైన లేదా సమర్థవంతమైన చర్చ జరగకుండానే ఈ మూడు చట్టాలను ఆమోదించారని ఆ పిటిషన్ పేర్కొంది. బిల్లుల ఆమోదం సమయంలో చాలా కొద్దిమంది సభ్యులు మాత్రమే పాల్గొన్నారని తెలిపింది. 146 మంది ప్రతిపక్షాల ఎంపీలను సస్పెండ్ చేయడంపై హిందూ పత్రికలో వచ్చిన వార్తలను ఆ పిటిషన్ ప్రస్తావించింది. కొత్త చట్టాలకు



అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు హోం మంత్రికి పంపిన లేఖలను కూడా పిటిషన్‌లో ఉటంకించారు.

కొత్త చట్టాలు అస్పష్టంగా, సందిగ్ధంగా వున్నాయని పిటిషన్ పేర్కొంది. పోలీసులకు విస్తృతాధికారాలను అప్పచెబుతున్నాయని, అరెస్టు సమయంలో చేతులకు బేడీలు వేయడం వంటి అమానవీయ పద్ధతులను పునరుద్ధరిస్తున్నారని పిటిషన్ పేర్కొంది. ఐపిసి స్థానంలో తీసుకొస్తున్న భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) గ్యాంగ్, మొబైల్ ఆర్గనైజ్డ్ క్రైమ్ గ్రూప్స్ వంటి పదాలను నిర్వచించలేదని తెలిపింది.

మానసిక అస్వస్థులుగా వున్నవారిని ప్రాసిక్యూషన్ నుండి బిఎన్‌ఎస్ కాపాడుతోందని పిటిషన్ పేర్కొంది. ఆ మానసిక అస్వస్థత నిర్వచనంలో మానసికంగా సరైన ఎదుగుదల లేకపోవడం (మెంటల్ రిటార్డేషన్) అంశాన్ని మినహాయించారని పేర్కొంది. దీనివల్ల మానసికంగా ఎదుగుదల లేని వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయవచ్చునని స్పష్టమవుతోంది. దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, సమగ్రతలకు ముప్పు కలిగించే దేశద్రోహ చర్యల స్థానంలో కొత్త నేరాన్ని ప్రవేశపెట్టారు. టెర్రరిజం కూడా బిఎన్‌ఎస్ కింద నేరమే. సిఆర్‌పిసి స్థానంలో తీసుకొస్తున్న భారతీయ నాగరిక్ సురక్ష (సెకండ్) సంహిత-2023, 15 రోజుల పోలీసు కస్టడీకి ఒకేసారి అనుమతిస్తోంది లేదా దశలవారీగానైనా తీసుకోవడానికి అనుమతిస్తోంది. వలసవాద వారసత్వమైన 144వ సెక్షన్‌ను ఈ కొత్త చట్టంలో కూడా కొనసాగిస్తున్నారని పిటిషన్ పేర్కొంది.

ఇక మూడవ చట్టమైన భారతీయ సాక్ష్య అధినియం, 2023 ప్రకారం ఎలక్ట్రానిక్ రికార్డులు ప్రాథమిక సాక్ష్యాధారాలుగా పరిగణిస్తారు. పాత చట్టంలో వీటిని సెకండరీ సాక్ష్యాలుగా పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు వంటి వాటిని స్వాధీనం చేసుకుని, దర్యాప్తు చేసేటప్పుడు వాటిలో సమాచారం తారుమారు కాకుండా చూసేందుకు ఎలాంటి రక్షణ కల్పించలేదని పిటిషన్ పేర్కొంది.

సుజయె ప్రాంతంలో భీకర దాడులు

- గత 24 గంటల్లో 47మంది పాలస్తీనియన్ల మృతి

గాజా : గాజాలో ఇజ్రాయిల్ సైన్యం సాగిస్తున్న దాడుల్లో గత 24గంటల్లో 47మంది పాలస్తీనియన్లు మరణించారు. 52మంది గాయపడ్డారు. తాజాగా గాజా నగరంలోని సుజయె ప్రాంతం నుండి ప్రజలను తక్షణమే ఖాళీ చేయాల్సిందిగా సైన్యం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఇజ్రాయిల్ ట్యాంకులు సుజయె ప్రాంతంలోకి వచ్చేశాయని, పారిపోతున్న ప్రజలపై భీకరంగా దాడులకు దిగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గత రాత్రంతా ఈ ప్రాంతంపై బాంబు దాడులు కొనసాగాయి. దాంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు కూడా సహాయక సిబ్బందికి సాధ్యం కాలేదని పాలస్తీనా వర్గాలు చెప్పాయి. ఒకపక్క సరైన ఆహారం లేక కరువుతో అల్లాడుతుంటే మరోపక్క ట్యాంకులు, విమానాలతో ఇలా ప్రజలను వేటాడుతున్నారని, ఈ యుద్ధం ముగిసే ఆశ కనుచూపు మేరలో కనబడడం లేదని స్థానికుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఏ ఏ ప్రాంతాలు అత్యంత ప్రమాదకరంగా మారతాయో తెలియజేస్తూ ఇజ్రాయిల్ ఆర్మీ ఒక మ్యాప్‌ను కూడా ప్రచురించింది. దాంతో కుటుంబాలకు కుటుంబాలు గాజా దక్షిణ ప్రాంతానికి తరలి వెళుతున్నాయి. ఇప్పటివరకు గాజాలో 37,765మంది మరణించగా, 86,429మంది మరణించారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ దాడుల్లో కనిపించకుండా పోయిన వేలాదిమంది పిల్లల మృతదేహాలు ఆ శిధిలాల కిందే సమాధి అయిపోయాయని యునిసెఫ్ డిప్యూటీ చీఫ్ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి తెలియజేశారు.

బొలీవియాలో మరో సైనిక కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బందిని మోహరించనున్నామని, .2019లో అప్పటి అధ్యక్షుడు ఎవో మొరేల్స్ ప్రభుత్వ కూల్చివేతలో ప్రమేయం వున్న, రాజకీయ ఖైదీలు జెనిన్ అనెజ్, లూయిస్ ఫెర్నాండోలను విడుదల చేస్తామని ప్రకటించారు. సైన్యం ప్రభుత్వ భవనం లోపలకు చొచ్చుకుపోవడానికి ప్రయత్నిస్తుండగానే వందలాదిమంది ప్రజలు ప్రభుత్వ భవనం వద్ద గుమికూడారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించి, సైన్యం ప్రభుత్వ భవాన్ని వెంటనే వీడి వెళ్లాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, సాధారణ పౌరులు ఉద్యమించగా సైనికాధికారులు వారిపై నిర్బంధ చర్యలకు పాల్పడ్డారు. పోలీసులు విచక్షణారహితంగా బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ప్లాజా మురిల్లోకు వెళ్లే దారిని మూసివేశారు.

ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ఎవో మొరేల్స్ అప్రమత్తమయ్యారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఏకతాటిపైకి రావాల్సిందిగా బొలీవియా ప్రజలకు పిలుపునిచ్చారు. బొలీవియా విదేశాంగ మంత్రి సెలిండా సోసా వీడియో సందేశమిస్తూ, ప్రజాస్వామ్యం, శాంతి, భద్రతలపై దాడి చేసేందుకు బొలీవియా సైన్యంలోని కొన్ని విభాగాలను అక్రమంగా సమీకరించిన కొన్ని దేశాల చర్యలను తీవ్రంగా నిరసించారు. ప్రజాస్వామ్య విలువలు పరిరక్షించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని, దేశ ప్రజలను కోరారు.

20లక్షల మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బొలీవియా వర్కర్స్ సెంట్రల్ (సిఓబి) వెంటనే నిరవధిక సమ్మెను ప్రకటించింది. రాజ్యాంగ వ్యవస్థను పునరుద్ధరించాలని, బొలీవియాలో చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వం వుండాలని డిమాండ్ చేసింది. భవనాన్ని సైన్యం చుట్టుముట్టిన దాదాపు గంట తర్వాత అధ్యక్షుడు లూయిస్ అరెస్ కొత్త మిలటరీ కమాండర్‌గా జునిగా స్థానంలో జోస్ సాంచెజ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే బాధ్యతలు తీసుకున్న సాంచెజ్ సైన్యాన్ని వారి వారి యూనిట్లకు వెళ్లిపోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన లూయిస్ అరెస్ ప్రభుత్వానికి మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

బొలీవియా సామర్థ్యంపై నమ్మకముంది : చైనా

కుట్రకు విఫలయత్నం జరిగిన నేపథ్యంలో దేశంలో రాజకీయ పరిస్థితులను చక్కగా దిద్దుకొనగల సామర్థ్యం అధ్యక్షుడు లూయిస్ అరె-స్‌కు వుందని చైనా విశ్వసిస్తోందని గురువారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పారు. బొలీవియాలో అసాధారణ సైనిక చర్య వార్తలను బీజింగ్ పరిశీలిస్తోందని చెప్పారు. బొలీవియాకు మంచి మిత్రదేశంగా, భాగస్వామిగా ఈ పరిస్థితులను నుండి బొలీవియా బయటపడగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు. బొలీవియా ప్రజల ప్రాథమిక, దీర్ఘకాల ప్రయోజనాలకు అనుగుణంగానే ప్రభుత్వం సామర్థ్యం వుంటుందని తెలిపారు.

బొలీవియాకు మద్దతు : రష్యా

బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్సెకు మద్దతునిస్తున్నామని రష్యా ప్రకటించింది. బుధవారం బొలీవియాలో సైనిక కుట్రకు విఫలయత్నం జరిగిన నేపథ్యంలో మాస్కో ఈ ప్రకటన చేసింది. కుట్ర యత్నాన్ని రష్యా తీవ్రంగా ఖండించింది. అంతర్గత రాజకీయ వివాదాలేమైనా వుంటే వాటిని రాజ్యాంగబద్ధమైన చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ మేరకు రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటన చేసింది. బొలీవియా, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ప్రయత్నాలను ఖండించింది. ఇలాంటి చర్యలు గతంలో లాటిన్ అమెరికా ప్రాంతంతోసహా అనేక దేశాల్లో విషాదకర పర్యవసానాలకు దారితీశాయని పేర్కొంది. రష్యాకు బొలీవియా వ్యూహాత్మక భాగస్వామి అని వ్యాఖ్యానించింది. బ్రిక్స్‌లో చేరాలని బొలీవియా భావిస్తున్నట్లు మే నెల్లోనే అధ్యక్షుడు ఆర్సె చెప్పారని ఆ ప్రకటన పేర్కొంది.

ధరలు, నిరుద్యోగం ఊసే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగంలో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ పథకాలు చాలా వరకు ప్రచారానికే పరిమితమయ్యాయి. ఆరెస్సెస్ డ్రీమ్ ప్రాజెక్టుల్లో ఒకటి అయిన ప్రకృతి సేద్యాన్ని గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రత్యేకించి ప్రస్తావించారు. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున ఆర్గానిక్ పంటలకు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. శ్రీలంకలో దారుణ ఆహార సంక్షోభానికి ముఖ్య కారణాల్లో ఒకటి ఈ ప్రకృతి సేద్యం అన్న విషయం మరచిపోరాదు. తొలుత రాష్ట్రపతికి గజ ద్వారం వద్ద ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు రాజ దండంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమెతో కలిసి సభ లోపలికి వెళ్లారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది ఎంపిలుగా ప్రమాణస్వీకారం చేసిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రజల విశ్వాసాన్ని గెలిచి సభకు ఎన్నికయ్యారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయరని భావిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో సభ్యులు విజయవంతమవుతారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. సిఎఎ ప్రకారం శరణార్థులకు ప్రభుత్వం పౌరసత్వం మంజూరు చేయడం ప్రారంభించిందని అన్నారు. జులై ఒకటి నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి రానున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కించపరిచే ప్రతి ప్రయత్నాన్నీ ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. జమ్ముకాశ్మీర్‌పై శత్రువులు అంతర్జాతీయ వేదికలపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కానీ, ఈ ఎన్నికల్లో కాశ్మీర్ లోయలో మార్పు కనిపించిందని పేర్కొన్నారు. శత్రువుల కుట్రలకు అక్కడి ప్రజలు గట్టిగా బదులిచ్చారన్నారు. అక్కడి ప్రజలు పెద్దయెత్తున ఓటింగ్‌లో పాల్గొనడం విశేషమని అన్నారు. 'మన దేశ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్దవి. సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు ఇసికి అభినందనలు. ప్రజలు ప్రభుత్వాన్ని విశ్వసించి మళ్లీ పట్టం కట్టారు. ప్రభుత్వ సుస్థిరత, నిజాయతీని నమ్మారు. ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రిఫార్మ్, పర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ ఆధారంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. పదేళ్ల పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైంది. పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది.' అని రాష్ట్రపతి అన్నారు.

గరీబ్ కల్యాణ్ యోజన కింద పేదలకు ఉచితంగా రేషన్ సరఫరా చేస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని, ఆయుష్మాన్ భారత్ అనేది గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని అన్నారు. 'వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చాం. అన్ని రంగాల్లో భారత్ బలంగా విస్తరిస్తోంది. ఉద్యోగాల కల్పనలోనూ ప్రభుత్వం కృషి చేస్తోంది. సర్వీస్ సెక్టార్లను కూడా ప్రభుత్వం బలపరుస్తోంది. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది.' అని వివరించారు.

బహిష్కరించిన ఆప్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ ఎంపీలు రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. ఆప్‌కు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు ప్లకార్డులు పట్టుకుని పార్లమెంట్ ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. 'ఇడి, సిబిఐల దుర్వినియోగాన్ని అరికట్టాలి, కేజ్రీవాల్‌ను విడిచిపెట్టాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

నీట్‌పై నేడు వాయిదా తీర్మానం

నీట్ వ్యవహారంపై పార్లమెంట్‌లో శుక్రవారం ప్రతిపక్షాలు లేవనెత్తనున్నాయి. శుక్రవారం వాయిదా తీర్మానం ఇవ్వాలని నిర్ణయించాయి. గురువారం రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్ష ఇండియా ఫోరం నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నీట్‌పై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించారు.

ప్రజాగ్రహానికి తలొగ్గిన కెన్యా అధ్యక్షుడు

- ఆర్థిక బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటన

నైరోబి : ప్రజలపై పన్నుల భారాన్ని పెంచుతూ తీసుకొచ్చిన ఆర్థిక బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు కెన్యా అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించారు. ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదించిన గంటల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబికింది. రాజధాని నైరోబిలోని వీధుల్లో ఆందోళనలు చేస్తున్న వారిని పోలీసులు కాల్చివేశారు. మొత్తంగా 53మంది మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. పాలకవర్గాల ఉదాసీనత, అవినీతి నేపథ్యంలో ఇప్పటికే అధిక ధరలు, పెచ్చరిల్లిన నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఈ పన్ను పెంపు ప్రతిపాదనలు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఆర్థిక బిల్లును వ్యతిరేకిస్తూ తలెత్తిన నిరసనలు చివరకు తిరుగుబాటుగా మారాయి. రూటో ప్రభుత్వాన్ని మాత్రమే కాకుండా 60ఏళ్ల నాటి స్వాతంత్ర్యానంతర పార్లమెంట్ భవనాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేశారు. దేశంలోని 37 కౌంటీల్లో లక్షలాదిమంది నిరసనలు తెలిపారు. రూటో రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. కాల్పులు, బాష్పవాయు గోళాలతో పోలీసులు కిరాతకంగా ఆందోళనలను అణచివేసేందుకు ప్రయత్నించారు. నైరోబి శివార్లలోని గితురాయ్ ప్రాంతంలో 30మంది, దేశవ్యాప్తంగా మిగిలిన ప్రాంతాల్లో మరో 23మంది చనిపోయారు. 17గంటల వ్యవధిలోనే రూటో బెదిరింపు స్వరం మారింది. తొలుత హింసను రెచ్చగొడుతున్న వారిని, అరాచకాన్ని సృష్టిస్తున్నవారిని దారుణంగా అణచివేస్తామని, సైన్యాన్ని కూడా రంగంలోకి దించుతున్నామని ప్రకటించారు. కానీ బుధవారం పొద్దుపోయేసరికి పరిస్థితి మారింది. పెద్ద ఎత్తున సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ బిల్లును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. బిల్లుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు రాబోయే రెండు వారాల్లో బహుళ రంగాలు, వర్గాలవారితో చర్చలు జరుపుతామని ప్రతిపాదించారు.

కొద్దిమంది ఎదుగుదలే అభివృద్ధా? : అఖిలేష్

న్యూఢిల్లీ : కొద్దిమంది వ్యక్తుల ఎదుగుదలతో దేశం అభివృద్ధి చెందినట్లు కాదని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు, ఎంపి అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు. గురువారం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో భారత్ ఐదవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా విస్తరించిందని, త్వరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించ బోతున్నామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయినా రైతులు ఎందుకు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు? ఇంత పెద్ద ఎత్తున యువత ఎందుకు నిరుద్యోగులుగా మిగిలిపోయారని ప్రశ్నించారు.



మీకోసం

ఇడ్లీ పిండిలో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరినూనె కలిపితే ఇడ్లీలు బాగా మెత్తగా వస్తాయి.

జీవన సౌరభం

ఎదుటివారి ఆలోచనలను గౌరవించకపోయినా ఫరవాలేదు.. అపహాస్యం మాత్రం చేయకూడదు.

పిల్లల బాధ్యత



శరభయ్యను వ్యక్తి యుండె
చెట్టు అంటె గిట్టకుండె
ఇది పొయ్యిలోకి అనుచును
గొడ్డలిచే కొట్టుచుండె

రామయ్యను పెద్ద చూచె
శరభయ్యనడ్డగించె
గొడ్డలిని తను గుంజుకొని
కోపమునూ ప్రదర్శించె

" చెట్టు ఇచ్చు చలువ నీడ
పేదవారికదియు మేడ
చెట్టు లేకుంటే ఇంక
కష్టమే నరులకు చూడ

ఆకుపూలు కాయ పండ్లు
ఉంటె దూరమె కడగండ్లు
చెట్టు చుట్టు ఉన్న యెడల
కళకళలాడునూ ఇండ్లు

కాలుష్యం అంతరించు
పచ్చదనం కానిపించు
వేసవి కాలము కూడా
ఎందరొ యిట విశ్రమించు

దానిని వెల కట్టవద్దు
చేజేతుల కొట్టవద్దు
వర్షాభావం అందుకె
ఎవ్వరినీ తిట్టవద్దు

పిల్లలార నాటరండి ...
మొక్కలు మన పిల్లలండి
వాటి ఆలన పాలనను
మీరే ఇకను చూడండి"

అని పలికిన పెద్ద తోడ
శరభయ్యయు జతను గూడ
పిల్లలంత నేల నంత
గునపముతో తవ్వె జూడ

నాటు నాటు మొక్క నాటు
నాటకున్న మనకు చేటు
పిల్లలు మొక్కలను నాట
లేదు మనకు ఆటుపోటు

మొక్కలనూ పంచుకొనిరి
బిడ్డలవలె పెంచుకొనిరి
నీళ్ళు పోసి కంచె వేసి
జాగ్రత్తగా చూసుకొనిరి

మొక్కలు పెరిగి చెట్లయ్యె
ఊరు రూపమె వేరయ్యె
చూపరులకు అది అంతా
నందనమై కాననయ్యె!

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, ధర్మపురి, 99085 54535.




దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో బంటి తన ఇంటికి వెళ్లే దారి మర్చిపోయాడు. కాస్త మీరు చూపించరూ!

నేను గీసిన బొమ్మ



జి.జోహకుమార్,
8వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
చోడవరం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎగిరే చిన్న నక్షత్రం...!

స్కూల్లో పిల్లలకు పాఠాలు చెప్పడం, పరీక్షలు రాయించడం, మార్కులు వేయడంతో తమ బాధ్యత తీరిపోయిందని కొంతమంది ఉపాధ్యాయులు భావిస్తారు. కానీ, చాలామంది టీచర్లు చదువుతో పాటు విజ్ఞానం, వికాసం వైపు పిల్లలు నడిచేలా ప్రోత్సహిస్తారు. అయితే, పాఠాలు నేర్పిన పిల్లలకు జీవనోపాధి కూడా కల్పించాలనుకునే టీచర్లు మాత్రం చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటివారిలో ఒకరే మినీ నాయక్. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్య నేర్పే మినీ, ఇప్పుడు 'మినీ ఫ్లైయింగ్ స్టార్' పేరుతో ఓ కేఫ్ నిర్వహిస్తున్నారు. టీచర్ విధుల్లో ఉండాల్సిన ఆమె, కేఫ్ ఎందుకు నడుపుతున్నారో తెలుసుకుందాం.



ఛత్తీస్‌గఢ్, బార్గాఢ్ ప్రాంతానికి చెందిన మినీ, గతేడాది వరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు టీచర్‌గా ఉన్నారు. కొన్ని నెలల క్రితమే ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కేఫ్ నిర్వహిస్తున్నారు. 'సాధారణ స్కూల్లో కంటే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పాఠాలు చెప్పడం పెద్ద సవాల్‌తో కూడుకున్నది. అయినా మేము వెనుకాడం. కానీ ఆ పిల్లల్లో చాలామంది పేద కుటుంబాల నుండి వచ్చినవారే. విద్య నేర్చుకోవడంతోనే ఆ పిల్లలు, ఆ కుటుంబాల జీవితాలు మారవు. వారికి ఏదైనా ఉపాధి దొరికితేనే వారి బతుకులు బాగుపడతాయి. కానీ వాళ్లకి ఉపాధి ఎవరు ఇస్తారు? ఈ ప్రశ్న నన్ను చాలా రోజులు వేధించింది. విద్య నేర్చుకుని వచ్చే పిల్లలకు ఉపాధి మార్గం చూపించాలని నేనే మొదటి అడుగు వేశాను. వాళ్లు చేయగలిగే పనుల జాబితా తయారుచేశాను. కేఫ్ నిర్వహణ ఒక్కటే సులభం అనిపించింది. ఆదాయ మార్గంగానూ ఉంటుందని భావించాను' అంటూ కేఫ్ నిర్వహణ వెనకాల ఉన్న ఉద్దేశాన్ని మినీ చెబుతున్నారు.



తను భద్రపర్చుకున్న సొమ్ము, రూ.5 లక్షల రుణాన్ని తీసుకుని మరీ మినీ కేఫ్‌ని ప్రారంభించారు. అయితే ఇప్పుడే ఆమెకి అసలు సమస్య వచ్చిపడింది. కేఫ్‌లో పనిచేయడం కోసం సిబ్బందిని నియమించేందుకు ప్రత్యేక అవసరాలు గల స్కూళ్లకు వెళ్లారు. కానీ అక్కడ ఆమెకు నిరాశే ఎదురైంది. 'మాట్లాడలేని, వినలేని, తమ పనులు తామే చేసుకోలేని పిల్లలతో కేఫ్ నిర్వహణ ఏంటని?' హేళన చేసి మరీ ఆమెని వెనక్కి పంపేశారు. అయినా మినీ వెనుకడుగు వేయలేదు. తన సొంత గ్రామం నుండి, స్నేహితురాలికి తెలిసిన వాళ్ల ద్వారా అజయ్, ఘనశ్యామ్, హన్సరాజ్ అనే ముగ్గురు యువకులకు శిక్షణ ఇచ్చి మరీ కేఫ్ బాధ్యతలు అప్పజెప్పారు.

ఈ ముగ్గురికి మినీతో పాటు ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధించే మరో ఉపాధ్యాయిని దీపమాల కూడా శిక్షణ ఇచ్చారు. ఇద్దరు టీచరమ్మల శిక్షణలో ఆ ముగ్గురు కేఫ్ నిర్వహణలో నైపుణ్యం సాధించారు. ఆర్డరు తీసుకోవడం, తయారుచేయడం, సర్వ్ చేయడం వంటివన్నీ నియమ నిబద్ధంగా చేస్తున్నారు.

ఈ కేఫ్‌లో మెనూ కార్డ్ కూడా 'సైన్ లాంగ్వేజ్'లోనే డిజైన్ చేశారు. 'ఏదేని వంటకాన్ని ఆర్డరు చేయాలనుకుంటే ఆ కస్టమరు సైన్ లాంగ్వేజ్‌లోనే చెప్పాలి. అప్పుడే వారికి సులభంగా అర్థమవుతుంది. సరైన ఆర్డరు తీసుకువస్తారు. అందుకు వీలుగా మెనూ కార్డులోని పదార్థాలను సైన్‌లాంగ్వేజ్‌లో ఎలా చెప్పాలో కేఫ్ గోడల మీద, అందమైన రంగుల్లో పెయింట్ చేయించాము. అలాగే టేబుల్‌పై ప్లకార్డులు పెట్టాం. నీళ్లు కావాలన్నా, టేబుల్ శుభ్రం చేయాలన్నా వాటిని చూపిస్తే చాలు. అలాగే వెయిటర్‌ని పిలవాలని అనుకునేవారు తమ సెల్‌ఫోను ఫ్లాష్ లైట్ ఆన్ చేసి కౌంటర్ వైపు చూపిస్తే చాలు' అని మినీ కేఫ్ నిర్వహణ గురించి వివరించారు.

'మన చుట్టూ ఎంతోమంది ప్రత్యేక అవసరాలు గల వాళ్లు ఉంటారు. విద్య నేర్పడంతోనే వాళ్ల బాధ్యత తీరిపోదు. ఏదైనా ఉపాధి చూపితే కొంతమంది ఆ దిశగా కూడా నైపుణ్యం సాధిస్తారు. ఆ ఉద్దేశంతోనే ఈ కేఫ్ నిర్వహిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని కేఫ్‌లు ఏర్పాటుచేసే ఆలోచన ఉంది' అని మినీ తన భవిష్యత్తు కార్యాచరణ గురించి చెబుతున్నారు. పిల్లలకు చదువుతో పాటు, ఉపాధి కూడా చూపిస్తున్న మినీ లాంటి టీచరమ్మలు చాలా అరుదు కదూ!

బెల్లం పొడితో ఆరోగ్యం..

ఈమధ్య కాలంలో చాలామంది పంచదార వాడకాన్ని బాగా తగ్గించారు. ప్రత్యామ్నాయంగా బెల్లం పొడి (గోధుమ షుగర్) వాడకం పెరిగింది. సాధారణ పంచదారతో పోలిస్తే, బెల్లం పొడిలో మొలాసిస్ అధికంగా ఉంటుంది. ఇదే దానికి ప్రత్యేకమైన రంగును, రుచిని ఇస్తుంది. అయితే ఈ పంచదార తీపి రుచికి మించి, వివిధ రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆహారంలో విలువైన పోషకంగా ఉంటుంది.

సమృద్ధిగా యాంటీ ఆక్సిడెంట్లు : బెల్లం పొడిలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్లు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

ఖనిజాల నిలయం : ప్రాసెసింగ్ సమయంలో పోషకాలను తొలగించే తెల్ల చక్కెర వలె కాకుండా, బెల్లం పొడి కాల్షియం, పొటాషియం, ఐరన్ వంటి కొన్ని సహజ ఖనిజాలను కలిగి ఉంటుంది. ఈ ఖనిజాలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయి.

తక్కువ గ్లైసెమిక్ : తెల్ల చక్కెరతో పోలిస్తే బెల్లం పొడి తక్కువ గ్లైసెమిక్‌ను కలిగి ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలలో నెమ్మదిగా, స్థిరమైన పెరుగుదలకు కారణమవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి లేదా వారి బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.

ఆరోగ్యమైన జీర్ణక్రియ : ఈ చక్కెరలోని మొలాసిస్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని తగ్గించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

రోగ నిరోధకత పెంపు : బెల్లం పొడిలో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. శరీరానికి అంటు వ్యాధులు, అనారోగ్యాలతో పోరాడటాన్ని సులభం చేస్తుంది.



చర్మ ఆరోగ్యం మెరుగు : కొన్ని అధ్యయనాలు బెల్లం పొడి తీసుకోవడం వల్ల వాపును తగ్గించడం, కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని సూచిస్తున్నాయి. ఈ చక్కెరను బేకింగ్లో, వంటల్లో లేదా పానీయాల్లో సహజ తీపి పదార్థంగా ఉపయోగించవచ్చు.

ఆదుకున్న రోహిత్, సూర్యకుమార్

- **భారత్ 171/7**
- **ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అడ్డంకి**



గయానా: టి20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరగనున్న రెండో సెమీస్‌కు వర్షం పలుమార్లు అడ్డంకిగా నిలిచింది. గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో తొలుత టాస్ కూడా ఆలస్యమైంది. నిర్ణీత సమయానికి ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారడమే ఇందుకు ప్రధాన కారణం. పలుమార్లు ఔట్‌ఫీల్డ్‌ను అంపైర్లు పరీక్షించిన అనంతరం టాస్ వేయగా.. ఇంగ్లండ్ కెప్టెన్ బట్లర్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. అనంతరం తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 171పరుగులు చేసింది. ఓపెనర్ రోహిత్ శర్మ(57) అర్ధసెంచరీకి తోడు సూర్యకుమార్ యాదవ్(47) తృటిలో అర్ధసెంచరీని మిస్ చేసుకున్నాడు. టీమిండియా ఇన్నింగ్స్ మధ్యలోనూ ఒకసారి వర్షం అడ్డంకిగా నిలవడంతో దాదాపు గంటన్నరసేపు మ్యాచ్ నిలిచిపోయింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్ పూర్తయ్యే సమయానికి దాదాపు నాలుగు గంట సమయం పట్టింది. టీమిండియా పవర్ ప్లే 6 ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్ల నష్టానికి 46పరుగులు చేసింది. కోహ్లి(9), పంత్(4) నిరాశపరిచారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ కోహ్లి(9) మరోసారి నిరాశపరిచాడు. ఆ తర్వాత రిషబ్ పంత్(4) కూడా నిరాశపరచడంతో భారతజట్టు 40పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సూర్యకుమార్ యాదవ్-రోహిత్ శర్మ కలిసి 3వ వికెట్‌కు 73పరుగులు జతచేసి ఇన్నింగ్స్‌ను ఆదుకున్నారు. చివర్లో హార్దిక్(23), జడేజా(17నాటౌట్), అక్షర్(10) బ్యాటింగ్‌లో మెరిసారు.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (బి)రషీద్ 57, కోహ్లి (బి)టోప్లే 9, పంత్ (సి)బెయిర్‌స్టో (బి)కర్రన్ 4, సూర్యకుమార్ (సి)జోర్డాన్ (బి)ఆర్చర్ 47, హార్దిక్ (సి)కర్రన్ (బి)జోర్డాన్ 23, జడేజా (నాటౌట్) 17, దూబే (సి)బట్లర్ (బి)జోర్డాన్ 0, అక్షర్ (సి)సాల్ట్ (బి)జోర్డాన్ 10, అర్ష్‌దీప్ (నాటౌట్) 1, అదనం 3. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 171పరుగులు. **వికెట్ల పతనం:** 1/19, 2/40, 3/113, 4/124, 5/146, 6/146, 7/170 **బౌలింగ్:** టోప్లే 3-0-25-1, ఆర్చర్ 4-0-33-1, కర్రన్ 2-0-25-1, రషీద్ 4-0-25-1, జోర్డాన్ 3-0-37-3, లివింగ్‌స్టోన్ 4-0-24-0.

30ఏళ్ల చరిత్రలో

తొలిసారి ఫైనల్‌కు దక్షిణాఫ్రికా

- **సెమీస్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 9వికెట్ల తేడాతో గెలుపు**



ట్రినిడాడ్: టి20 ప్రపంచకప్-2024 ఫైనల్లోకి దక్షిణాఫ్రికా జట్టు దూసుకెళ్లింది. టారోబాలోని బ్రియాన్ లారా స్టేడియంలో గురువారం ఏకపక్షంగా సాగిన తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు 9 వికెట్ల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. దీంతో దక్షిణాఫ్రికా జట్టు 30ఏళ్లలో తొలిసారి ఓ ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్ జట్టు11.5 ఓవర్లలో 56పరుగులకే ఆలౌటైంది. స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ డికాక్ (5) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. మరో ఓపెనర్ హెండ్రిక్స్(29), కెప్టెన్ మార్క్రమ్(23) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరూకీ ఒక వికెట్ దక్కించుకున్నాడు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్ 11.5ఓవర్లలో కేవలం 56పరుగులకు ఆలౌటైంది. టోర్నీ ఆరంభం నుంచి ఇప్పటివరకు అసాధారణ ప్రతిభ కనబరిచిన ఆఫ్ఘన్ బ్యాటర్లు రాణించినా.. కీలక మ్యాచ్‌లో చేతులెత్తేశారు. అజ్మతుల్లా ఒమర్జాయ్(10) మినహా మిగతా వారెవరూ రెండంకెల స్కోరు చేయలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లు వరుస వికెట్లు పడగొడుతూ అఫ్గాన్‌ను కుప్పకూల్చారు. ఓపెనర్లు గుర్బాజ్(0), జర్దాన్ (2), తొలి డౌన్‌లో వచ్చిన గుల్బాదిన్ నైబ్(9) పూర్తిగా విఫలమయ్యారు. ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు ఒమర్జాయ్ ప్రయత్నించాడు. కానీ, నోకియా బౌలింగ్‌లో స్టబ్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కెప్టెన్ రషీద్ ఖాన్ (8) కూడా ఆకట్టుకోలేక పోయాడు. నబీ(0), జనత్(8), నూర్ అహ్మద్(0), నవీనుల్ హక్(2), ఫరూకీ(2) ప్రభావం చూపించలేకపోయారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్సెన్, షాంసీలకు చెరో 3 వికెట్లు తీయగా.. రబడా, నోర్జే రెండేసి వికెట్లు పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ జాన్సెన్‌కు లభించింది.

దక్షిణాఫ్రికా తొలిసారి..

సెమీస్‌లో ఆఫ్ఘన్‌పై గెలుపుతో సఫారీల మూడు దశాబ్దాల కల సాకారమైంది. 1992 వన్డే ప్రపంచ కప్ నుంచి దక్షిణాఫ్రికా క్రికెట్‌లోకి తిరిగి ప్రవేశించి ఒక్కసారి కూడా ఐసిసి టోర్నీలలో ఫైనల్‌కు చేరలేదు. 1992, 1999, 2007, 2015, 2023 వన్డే ప్రపంచకప్‌లలో సెమీఫైనల్ వరకు చేరినా ఫైనల్‌కు చేరడంలో విఫలమైంది. ఇక టి20 ప్రపంచకప్‌లో తొలి నుంచి పాల్గొంటున్నా.. రెండుసార్లు (2009, 2024)లలో సెమీస్‌కే పరిమితమైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68